

నేడు డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా కోన తాతారావు బాధ్యతల స్వీకరణ



విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జిగా కోన తాతారావు సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు మర్రిపాలెంలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తారు. జనసేన పార్టీకి చెందిన తాతారావును ప్రభుత్వం డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ రెండు రోజుల క్రితం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే.



ఆర్కే బీచ్‌లో సేదతీరుతున్న ప్రజలు



మండిన సండే

- మధ్యాహ్నం వేడిగాడ్పులు
- బీచ్‌కు పోటెత్తిన సందర్శకులు
- ఎయిర్‌పోర్టులో 38 డిగ్రీలు..

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన మూడు రోజుల తరువాత నగరంలో ఆదివారం ఎండ తీవ్రత కొనసాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రతతోపాటు వేడి వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం నగరంపైకి పడమర దిశ నుంచి పొడి గాలులు వీయడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు నగరంపైకి వడగాడ్పులు కొనసాగడంతో వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారంతా ఠారెత్తిపోయారు. ఈ వేసవి సీజన్‌లో తొలిసారిగా నగరంలో గాడ్పులు వీశాయి. రాత్రి వరకు వేడి వాతావరణం కొనసాగింది. విశాఖ ఎయిర్‌పోర్టులో 38 డిగ్రీలు (సాధారణం కంటే 2.8 డిగ్రీలు ఎక్కువ) నమోదైంది. కాగా ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు వచ్చిన సందర్శకులతో ఆర్కే బీచ్ కిటకిటలాడింది. చాలా రోజుల తరువాత బీచ్‌కు అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చారని పలువురు వ్యాపారులు పేర్కొన్నారు.

తొట్లకొండపై యోగాంధ్ర



తొట్లకొండపై యోగాసనాలు. (ఇన్‌సెట్లో) ఆసనాలు వేస్తున్న కలెక్టర్, జేసీ..



- 21న ప్రపంచ రికార్డు నెలకొల్పేలా 5 లక్షల మందితో యోగాసనాలు: కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం తొట్లకొండపై యోగాసనాల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. యోగాంధ్ర వేడుకల్లో భాగంగా ... మిగతా 6వ పేజీలో

రేషన్ డిపోల్లో సందడి

- పూర్వ విధానంలో సరకులు పంపిణీ
- కూటమి ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా ప్రారంభం
- తొలిరోజు ఆన్‌లైన్‌లో 30,541 మందికి బియ్యం పంపిణీ
- మొరాయించిన సర్వర్‌తో పంపిణీలో జాప్యం



సాగర్‌నగర్‌లో సరకులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సుమారు నాలుగేళ్ల తరువాత రేషన్ డిపోలు కళకళలాడుతున్నాయి. ప్రభుత్వం ఎండీయూ విధానాన్ని రద్దు చేసి, చౌక ధరల దుకాణాల్లో రేషన్ పంపిణీకి ఆదేశాలు జారీ చేయడంతో ఆదివారం రేషన్ డిపోలను అట్టహాసంగా ప్రారంభించారు. బియ్యం కార్డుదారులకు పంచదార, బియ్యం పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 642 రేషన్ డిపోల్లో ఉదయం 8 గంటల నుంచి కార్డుదారులకు సరకులను అందజేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డిపోలను అలంకరించిన డీలర్లు ప్రతిచోటా డిపో వివరాలతో బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పలుచోట్ల డిపోలకు వెళ్లి బియ్యం కార్డుదారులకు రేషన్ సరకులను పంపిణీ చేశారు. సాగర్‌నగర్‌లో కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, ఎంవీపీకాలనీలోని అప్పుఘర్‌లో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో కలిసి జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ డిపోల వద్ద కార్డుదారులకు బియ్యం అందజేశారు. కప్పరాడ, సీతమ్మధార ప్రాంతంలో ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, రైల్వే న్యూకాలనీలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, 95వ వార్డులో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, గోపాలపట్నం, నరవ, తదితర ప్రాంతాల్లో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, 67వ వార్డులో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కార్డుదారులకు సరకులను అందజేశారు. జిల్లాలో రేషన్ పంపిణీని డీఎస్‌వో వి.భాస్కర్, జిల్లా పరిశీలకుడు భగన్నారాయణలు పర్యవేక్షించారు. ఆదివారం సాయంత్రం వరకు జిల్లాలో 5.24 లక్షలమంది బియ్యం కార్డుదారుల్లో 30,541 మందికి (5.8శాతం) బియ్యం, 26,483 (5.04 శాతం) ... మిగతా 6వ పేజీలో

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

ఫొటో షూట్ కోసం బయలుదేరి కానరాని లోకాలకు..

- బైకుకు అడ్డంగా కుక్క రావడమే కారణం



రోడ్డుపై చెల్లాచెదరుగా పడివున్న మృతదేహాలు



శరగడం అవినాశ్ (ఫైల్ ఫొటో)



మద్దాల శ్రీరామ్ (ఫైల్ ఫొటో)

పెందుర్తి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సూర్యాస్తమయం సమయంలో సరదాగా ఫొటోలు తీసుకునేందుకు బైకుపై బయలుదేరిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదానికి గురవ్వడంతో వారి జీవితాలు అస్తమించిపోయాయి. ఇంటి నుంచి బయలుదేరిన అరగంట వ్యవధిలోనే ఈ ఇద్దరు యువకులు మృత్యుఒడికి చేరినట్టు అందిన సమాచారంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ దుర్ఘటన ఆదివారం సాయంత్రం పెందుర్తిలో చోటు చేసుకుంది. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పెందుర్తి ఆదిత్యనగర్‌లో ఉంటున్న శరగడం శ్రీనివాసరావు పద్మనాభం ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్నారు. ఆయన కుమారుడు శరగడం డానీ సత్య అవినాశ్(19) విజయనగరం ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అవినాశ్, ... మిగతా 6వ పేజీలో

‘ఆంధ్రజ్యోతి’ చొరవతో సమస్యలకు మోక్షం



- ‘అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా’కు స్పందన
- నేడు తిరుమలనగర్‌లో సభ
- హాజరు కానున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ‘ఆంధ్రజ్యోతి’ డైరెక్టర్ వేమూరి ఆదిత్య



డంపింగ్ యార్డు నుంచి చెత్తను తరలిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గాజువాక సమీపాన ఆటోనగర్‌ను అనుకుని ఉన్న తిరుమలనగర్ ప్రజలు పరిశ్రమల కాలుష్యంతో అల్లాడిపోయేవారు. మురుగునీటి పారుదల వ్యవస్థ కూడా సక్రమంగా ఉండేది కాదు. చీకటి పడితే అంతా అంధకారమే. ఆయా సమస్యలను ‘ఆంధ్రజ్యోతి’ వెలుగులోకి తీసుకువచ్చింది. పరిష్కారానికి కృషి చేసింది.



లోవోల్టేజీ సమస్య పరిష్కారం కోసం అదనపు ట్రాన్స్‌ఫార్మరును ప్రారంభించిన కార్పొరేటర్ బొండా జగన్ (ఫైల్)

తిరుమలనగర్‌లో ఈ ఏడాది జనవరి 28న ‘అక్షరం అండగా...పరిష్కారమే అజెండా’గా నినాదంతో చేపట్టిన కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ బొండా జగన్‌తో పాటు జీవీఎంసీ, రెవెన్యూ, పోలీస్, ... మిగతా 6వ పేజీలో

రాష్ట్రంలో తొలి యాంటీ డ్రగ్ పార్కు

సిటీ సెంట్రల్ పార్కులో రూ.3.5 కోట్లతో ఏర్పాటు



యాంటీ డ్రగ్ పార్కు నమూనా

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

యువతలో అత్యధికులు గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం గంజాయి సాగు, రవాణా కట్టడికి సరైన చర్యలు చేపట్టకపోవడంతో అది మహమ్మారిలా వ్యాపించింది. విశాఖపట్నం కేంద్ర కారాగారంలో మగ్గుతున్న రిమాండ్ ఖైదీలలో 70 శాతం మంది గంజాయితో పట్టుబడినవారే ఉంటున్నారు. పోలీస్ స్టేషన్లలోని వాహనాల్లో సగం గంజాయితో పట్టుబడినవే ఉంటున్నాయి. ఆ మత్తుకు బానిసలైన యువత జీవితాన్ని కోల్పోతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గంజాయిపై ఉక్కుపాదం మోపి, నిర్మూలనకు ప్రత్యేకంగా ‘ఈగిల్’ టీమ్‌ను ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ కట్టడి చేస్తోంది. ఈ నేపథ్యంలో మత్తుకు బానిసలైన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, తిరిగి కొత్త జీవితం ప్రారంభించేలా చేయడానికి విశాఖపట్నంలో ‘యాంటీ డ్రగ్ పార్క్’ ఏర్పాటుకు వీఎంఆర్డీఏ ముందుకువచ్చింది. దీనికి చైర్మన్ ప్రణవ్‌గోపాల్ చొరవ తీసుకున్నారు. నాడు ‘యువగళం’ పేరుతో నారా లోకేశ్‌తో కలిసి పాదయాత్ర చేసినప్పుడు మాదక ద్రవ్యాల బారినపడి పిల్లలు పాడైపోతున్నారని అనేక మంది తల్లిదండ్రులు చెప్పినప్పుడు వారి మదిలో ఈ ‘యాంటీ డ్రగ్ పార్కు’ రూపుదిద్దుకుంది. వీఎంఆర్డీఏ చైర్మన్‌గా ప్రణవ్‌గోపాల్ బాధ్యతలు చేపట్టిన తరువాత కమిషనర్ విశ్వనాథన్‌తో చర్చించి దీనికి రూపకల్పన చేశారు.

రెండు ఎకరాల్లో.. రూ.3.5 కోట్లతో..

ద్వారకా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ... మిగతా 6వ పేజీలో

వైద్య, ఆరోగ్య శాఖలో బదిలీలు షురూ..

విధి విధానాలను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఆరోగ్యశాఖ

- ఒకేచోట ఐదేళ్లు దాటి పనిచేస్తున్న ఉద్యోగులకు తప్పని స్థానచలనం



విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖలో బదిలీల ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభమైంది. ఇప్పటికే ఇతర ప్రభుత్వ శాఖల్లో బదిలీలు జరుగుతుండగా.. ఆరోగ్యశాఖలో మాత్రం ఈ ప్రక్రియ ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. బదిలీలకు సంబంధించి మార్గదర్శకాలు విడుదల కాకపోవడం వల్లే కాస్త ఆలస్యమైంది. అయితే శనివారం రాత్రి ఆరోగ్యశాఖ ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన విధి విధానాలను విడుదల చేసింది. దీంతో ఆరోగ్యశాఖలో వివిధ కేడర్లలో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంతోపాటు బోధనాస్పత్రుల్లో ఐదేళ్ల నుంచి పనిచేస్తున్న ఉద్యోగులందరికీ తాజా బదిలీల్లో స్థానచలనం కలగనున్నది. 25 ఏళ్ల తరువాత జూనియర్ అసిస్టెంట్లను కూడా బదిలీ చేస్తున్నారు. దీంతో అనేకచోట్ల పెరిగిన అవినీతి, వసూళ్ల వ్యవహారాలకు అడ్డుకట్ట పడేందుకు అవకాశం ఏర్పడుతుంది. కొన్నిచోట్ల ... మిగతా 6వ పేజీలో

ఉపాధ్యాయుల బదిలీల్లో వీడని గందరగోళం

- ఏజెన్సీలో ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా వెళ్లేందుకు స్కూల్ అసిస్టెంట్ల విముఖత
- మొత్తం స్కూళ్లల్లో ఇంకా 26 ప్రధానోపాధ్యాయుల పోస్టుల ఖాళీ
- ఎస్జీటీలకు అవకాశం ఇవ్వాలని డిమాండ్

-7లో



ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష రాయడానికి అధిక సంఖ్యలో వచ్చిన అభ్యర్థులు

ప్రశాంతంగా కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష

- 90.76 శాతం మంది హాజరు
- పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు
- ఉదయం 8 గంటల నుంచే కేంద్రాల వద్ద బారులుతీరిన అభ్యర్థులు

-6లో

మద్యం మత్తులో ఇరువురి మధ్య ఘర్షణ

- మేడపై నుంచి నెట్టేయడంతో చికిత్స పొందుతూ యువకుడి మృతి
- నిందితుడిపై హత్య కేసు నమోదు

-6లో



మృతుడు హేమంత్ కుమార్ (ఫైల్ ఫొటో)

ఉత్సాహంగా రేషన్ సరకుల పంపిణీ

- నియోజకవర్గం వ్యాప్తంగా ప్రారంభం
- సాగర్‌నగర్‌లో కార్డుదారులకు రేషన్ అందజేసిన కలెక్టర్
- వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకు సరకులు అందజేత


సాగర్‌నగర్ రేషన్ డిపో వద్ద కార్డుదారులకు సరకులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, జేసీ అశోక్


పద్మనాభంలో వృద్ధురాలికి ఇంటి వద్ద సరకులు ఇవ్వడానికి వేలిముద్ర తీసుకుంటున్న డీలర్

సాగర్‌నగర్,జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ డీలర్లు సరకులను ఇంటి వద్దకు తీసుకువచ్చి ఇస్తారని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఇకపై ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీలోపు కార్డుదారులు డిపోలకు వెళ్లి సరకులు పొందవచ్చునని చెప్పారు. ఆదివారం ఆయన జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌తో కలిసి సాగర్‌నగర్ డిపోలో కార్డుదారులకు సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల్లోపు కార్డుదారులు సరకులు పొందవచ్చునని తెలిపారు. అవినీతికి, అక్రమాలకు లేకుండా క్యూఆర్ కోడ్‌తో కూడిన సమాచారం డిపోల వద్ద ఉంచామన్నారు. అధికారులు గాని, డీలర్లు గాని అక్రమాలకు పాల్పడితే ఉన్నతాధికారులకు తెలియజేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ సంగీత్ మాథూర్, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, డీఎస్‌ఓ వి. భాస్కరరావు, ఏఎస్‌ఓ కల్యాణి, 8వ వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, జనసేన నాయకుడు శాఖరి శ్రీనివాసరావు, నాయకులు బి. దొరబాబు, సారిపల్లి శ్రీనివాసరావు, బీజేపీ నాయకుడు ఎల్లాజి, తదితరులు పాల్గొన్నారు.

ఏడు, ఎనిమిది వార్డుల్లో..

మధురవాడ : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో రేషన్ డిపోల ద్వారా కార్డుదారులకు సరకులు పంపిణీ చేశారు. వాంబేకాలనీ, పిలకవానిపాలెం డిపోల్లో కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ సరకులు పంపిణీని ప్రారంభించారు. 8వ వార్డులోని పాత మధురవాడ మెట్టపై ఉన్న డిపో వద్ద కార్పొరేటర్ అప్పారావు సరకులు పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమాల్లో నాయకులు పిళ్లా వెంకటరావు, నరసింగరావు, నరసింహనాయుడు, దుర్గారావు, బాలాజీ, నాయుడు, నాగోతి శివాజీ, సూర్యప్రకాశరావు, అచ్చుతరావు, భవానీ పాల్గొన్నారు.

రెండో వార్డులో..

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డులో ఉన్న సంగివలస, వలందపేట, నమ్మివానిపేట, ఎడదాసరిపేట డిపోల్లో సరకుల పంపిణీని కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీలర్లు కార్డుదారులకు ఇబ్బందులు కలగనీయకుండా సరకులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు జి. సత్యం, సీహెచ్ రమణ, గురుమూర్తిరెడ్డి, పోతురాజు, శ్రీను, నరసింగరావు పాల్గొన్నారు.

రేఖవానిపాలెంలో...

భీమునిపట్నం (రూరల్) : మండలంలోని రేఖవానిపాలెంలో రేషన్ సరకుల పంపిణీని భీమిలి మాజీ ఎంపీపీ వై. కృష్ణవేణి ప్రారంభించారు. తహసీల్దార్ పి. రామారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు శాకమూరి శ్రీనివాస్, గుడివాడ కిరణ్‌కుమార్, కంటుభుక్త సునీత, రాజు, అనిల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురంలో...

ఆనందపురం : మండలంలోని బంటుపల్లి వారి కళ్ళాలు పంచాయతీలో టీడీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు రేషన్ సరకుల పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీలర్ బంటుపల్లి సత్య, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

98వ వార్డులో...

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు పోస్టాఫీసు వీధిలోని డిపోలో రేషన్ సరుకుల పంపిణీని కార్పొరేటర్ నరసింహం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీలర్ ఎం. రమణమ్మ, బీఎల్‌ఓ మజ్జి చంద్ర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సర్వర్ పని చేయక ఇబ్బందులు

భీమునిపట్నం : జీవీఎంసీ 3వ వార్డులోని స్మిత్ వీధి డిపోలో సర్వర్ పని చేయక రేషన్ సరకుల పంపిణీ జరగలేదు. నూకాలమ్మ గుడి వీధి, డచ్‌వీధి, మెయిన్‌రోడ్, గొల్లవీధి, వండావీధిలో వున్న డిపోల్లో సాయంత్రం 4 నుంచి కార్డుదారులకు సరకులు పంపిణీ చేపట్టారు.

ఐదో వార్డులో..

కొమ్మాది : జీవీఎంసీ ఐదో వార్డులో రేషన్ సరకుల పంపిణీని కార్పొరేటర్ మొల్లి హేమలత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాంద్రాసి అప్పలరాజు, నాగోతి సత్యనారాయణ, మన్యాల సోంబాబు, ఈగల రవికుమార్, దేవర శివ, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో..

పద్మనాభం : మండలంలోని 38 రేషన్ డిపోల ద్వారా సరకుల పంపిణీ పునఃప్రారంభమయ్యింది. పద్మనాభంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, స్థానిక నాయకులు సన్యాసిరావు, పద్దు, మహేష్, రాము, నర్సింగరావు, రమణ, చినరమణ తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలోని పలు డిపోలను తహసీల్దారు ఆనందరావు, పౌర సరఫరాల శాఖ డీటీ మురళీ సందర్శించారు. ఈ సందర్భంగా వారు డీలర్లకు పలు సూచనలు ఇచ్చారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి


సాయి మేఘన

ఆనందపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పందలపాక గ్రామంలో విద్యుదాఘాతంతో బాలిక మృతి చెందింది. సీఐ వాసునాయుడు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన గండిమాని రంగా కల్లుగీత కార్మికుడు. ఆయన కుమార్తె సాయి మేఘన (12) ఆనందపురంలోని ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. ఆదివారం ఉదయం ఇంట్లోని మోటారు వేయడానికి వెళ్లగా షార్ట్ సర్క్యూట్ వల్ల షాక్‌కు గురైంది. వెంటనే తల్లిదండ్రులు ఆమెను తగరపువలసలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఉన్న ఒక్కగాను ఒక్క కుమార్తె విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలోనూ విషాదం నెలకొంది.

వైద్య, ఆరోగ్య శాఖలో బదిలీలు షురూ..

... 5వ పేజీ తరువాయి

కొత్తవారిని రానివ్వకుండాఎంతోమంది ఉద్యోగులు పాతుకుపోయారు. ఇటువంటి వారి వల్ల అనేకచోట్ల అవినీతికి ఆస్కారం ఏర్పడుతోంది. తాజా బదిలీల్లో ఇలాంటి వారంతా కొత్త ప్రాంతాలకు వెళ్లనున్నారు. దీనివల్ల అవినీతికి చెక్ పడుతుందని పలువురు పేర్కొంటున్నారు. తాజా బదిలీలతో ఆరోగ్యశాఖలోని కీలక సెక్షన్లు, కేజీహెచ్, ఇతర ప్రభుత్వాస్పత్రుల్లోని కొన్ని విభాగాల్లో అవినీతికి అడ్డుకట్ట పడుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఇవీ మార్గదర్శకాలు..

బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను చూస్తే ఒకేచోట ఐదేళ్లు దాటి పనిచేస్తున్న ఉద్యోగులందరినీ ట్రాన్స్‌ఫర్ చేయనున్నారు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల్లో ఆఫీస్ బేరర్లుగా ఉండి ఒకే ఇనిస్టిట్యూట్‌లో మూడు నుంచి తొమ్మిదేళ్లలోపు పనిచేస్తున్న వారిని తప్పనిసరిగా మరో ఇనిస్టిట్యూట్ (లోకల్)కు మార్చాల్సి ఉంటుంది. లోకల్‌గా లేకపోతే బయటకు వెళ్లాల్సి ఉంటుంది. తొమ్మిదేళ్లు దాటితే తప్పనిసరిగా బదిలీ కావాలి. ఆఫీస్ బేరర్స్ కాని ఉద్యోగులు మూడు నుంచి ఐదేళ్లలోపు ఒకే ఇనిస్టిట్యూట్‌లో పనిచేస్తుంటే.. తప్పనిసరిగా లోకల్‌గా ఉన్న మరో ఇనిస్టిట్యూట్‌కు బదిలీ కావాల్సి ఉంటుంది. లోకల్‌గా వేకెన్సీ లేకపోతే తప్పనిసరిగా మరో ప్రాంతానికి వెళ్లాల్సిందే. ప్రతి ఉద్యోగి బదిలీ కావాలనుకుంటే ఐదు ప్రాంతాలను ఆప్షన్‌గా ఎంచుకోవచ్చు. ఈ మేరకు ఆయా కేటగిరీలకు సంబంధించిన ఉద్యోగుల వివరాలను ఈ నెల మూడో తేదీలోగా కార్యాలయ ఆవరణలో డిస్ ప్లే చేయాల్సి ఉంటుంది. ఉద్యోగులు తమ దరఖాస్తులను బదిలీ అధికారికి మూడో తేదీలోగా అందించాలి. అలాగే ఏమైనా మార్పులు, చేర్పులకు సంబంధించిన వివరాలను 4, 5 తేదీల్లోగా బదిలీలకు సంబంధించిన కంట్రోలింగ్ అధికారికి అందించవచ్చు. 6 నుంచి 8వ తేదీలోగా ఉన్నతాధికారులు ఆయా దరఖాస్తులను పరిశీలిస్తారు.

9న ఉద్యోగులు ఎంపిక చేసుకున్న స్థానాలతో కూడిన జాబితాను పొందుపరిచి గ్రీవెన్స్‌లను కోరుతారు. 10, 11 తేదీల్లో ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయవచ్చు.12 నుంచి 14వ తేదీల మధ్య అభ్యంతరాలను నివృత్తి చేసి తుది జాబితాను అధికారులు పొందుపరుస్తారు. అదేవిధంగా 15 నుంచి 17వ తేదీల మధ్య బదిలీలకు సంబంధించి కౌన్సె లింగ్‌ను నిర్వహిస్తారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

... 5వ పేజీ తరువాయి

పెందుర్తిలో ఉంటున్న మద్దాల శ్రీరామ్ (17) స్నేహితులు. శ్రీరామ్ ఇటీవల ఇంటర్ పూర్తి చేసి ఇంజనీరింగ్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నాడు. వీరిద్దరూ కలిసి ఆదివారం సాయంత్రం ఫొటో షూట్ కోసం వేరే స్నేహితుడి నుంచి బైకు తీసుకుని బయలుదేరారు. ఎన్‌హెచ్-16 రోడ్డు సరిపల్లి ఆర్వోబీ మీదుగా అవినాశ్ బైకును నడుపుతుండగా ఒక్కసారిగా కుక్క అడ్డు రావడంతో వాహనాన్ని అదుపు చేయలేక సమీపంలో గల డివైడర్‌ను బలంగా ఢీకొన్నాడు. దీంతో వాహనం నుజ్జునుజ్జవడంతో పాటు వారిద్దరూ రోడ్డుపై ఎగిరిపడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాపాయం తప్పేదని స్థానికులు పేర్కొంటున్నారు. సీఐ సతీశ్‌కుమార్, ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ డిపోల్లో సందడి

... 5వ పేజీ తరువాయి

మందికి పంచదార పంపిణీ చేశారు. కాగా కొన్నిచోట్ల మాత్రమే కందిపప్పును పంపిణీ చేయడం జరిగింది.

సర్వర్ మొరాయింపు

ఆదివారం ఉదయం నుంచి జిల్లాలోని 642 డిపోల్లో ఒకేసారి సరకుల పంపిణీ ప్రారంభమైంది. ఇంకా రాష్ట్రంలో వేల డిపోల్లో సరకుల పంపిణీకి డీలర్లు ప్రయత్నించడంతో సర్వర్ మొరాయించింది. నెట్‌వర్క్ ఎర్రర్ అని, మరోసారి ప్రయత్నించండి అంటూ ఈపోస్ మిషన్‌పై చూపించడంతో కార్డుదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో గంటకు పదికి మించి కార్డుదారులకు సరకులు ఇవ్వడానికి డీలర్లు ప్రయత్నించాల్సి వచ్చింది. దీనికితోడు ఆదివారం ఎండ తీవ్రత కొనసాగడంతో డిపోల వద్ద కార్డుదారులు అసౌకర్యానికి గురయ్యారు. సర్వర్ మొరాయింపు సమస్యను పౌరసరఫరాల అధికారుల దృష్టికి పలువురు డీలర్లు తీసుకువెళ్లారు. ఆదివారం సెలవు రోజు కావడంతో సర్వర్ సమస్యను పరిష్కరించడానికి వీలుకావడం లేదని అధికారులు వివరించారు. ఒకేసారి వేలమంది డీలర్లు లాగిన్ కావడంతో సమస్య ఉత్పన్నమైందని, రెండు మూడు రోజులల్లో అంతా సర్దుకుంటుందని అధికారులు చెబుతున్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కానిస్టేబుళ్ల నియామకాలకు సంబంధించిన మెయిన్స్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని 27 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 12,491 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 11,338 (90.76 శాతం) మంది హాజరయ్యారు. ఆయా కేంద్రాల వద్ద పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 8 గంటలు నుంచే అభ్యర్థులు బారులుతీరారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరిగింది. జిల్లాలోని పరీక్ష కేంద్రాలకు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే లోపలకు అనుమతించారు. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల ఉన్న జిరాక్స్ సెంటర్లను పోలీస్ అధికారులు మూసివేయించారు. కాగా పలు కేంద్రాలను నగర ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, డీసీపీలు అజిత వేజెండ్ల, డి.మేరీప్రశాంతి, శ్రీకృష్ణకాంత్‌లు పరిశీలించారు.

అప్పన్నను దర్శించుకున్న పంచాయతీరాజ్ శాఖ కమిషనర్

సింహాచలం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ రేవు ముత్యాలరాజు కుటుంబ సమేతంగా వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు ఆహ్వానం పలికారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు


పైడిరాజును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు

తగరపువలస, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు తెలిపారు. ఆదివారం ఆయన తగరపువలసలోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన లక్ష్మీపురం గెజిటెడ్ హెచ్‌ఎం గాడు పైడిరాజు పదవీ విరమణ కార్యక్రమంలో మాట్లాడారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల కౌన్సెలింగ్, డీఎస్సీ నియామకాలు పూర్తయిన తరువాత కార్యచరణపై దృష్టిసారిస్తామని చెప్పారు. ప్రతి జిల్లాలో సమస్యల పరిష్కారానికి కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. బదిలీల కౌన్సెలింగ్‌లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. పైడిరాజు విద్యార్థులకు చదువు చెప్పడంతో పాటు సేవా కార్యక్రమాలు కూడా చేపట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శివరాణి, భీమిలి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు కె.ఎస్. నాయుడు, గెజిటెడ్ హెచ్‌ఎం డి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు డొకర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

10న పైడితల్లమ్మ వార్షిక పండగ


పండగ తేదీని ప్రకటిస్తున్న లండ వెంకటరమణ

సింహాచలం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి సోదరి, అడివివరం, తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పైడితల్లమ్మ వార్షిక పండగ ఈనెల 10న నిర్వహించాలని గ్రామ సభ ఏకగ్రీవంగా నిర్ణయించింది. పూజారి వంశీయులు లండ వెంకటరమణ, సింహాచలం దేవస్థానం ఏఈఓ ఆనందకుమార్, 98వ వార్డు కార్పొరేటర్ నరసింహం సారథ్యంలో పండగ నిర్వహణపై ఆదివారం గ్రామ సభ నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో పూర్తిస్థాయి విద్యుత్ అలంకరణ ఉండాలని, నేల వేషాలు, బళ్ల వేషాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. అలాగే అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు కనీస వసతులు కల్పించాలని, అడివివరం కూడలి, గోశాల కూడలిలో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయాలన్నారు. కాగా గత ఆర్థిక సంవత్సరంలో అమ్మవారి హుండీ, ఇతర మార్గాల ద్వారా ఖజానాకు రూ.5.83 లక్షల ఆదాయం సమకూరిందని, 2024 పండగ నిర్వాహణకు సుమారు రూ. 8 లక్షల వరకు ఖర్చయినట్టు దేవస్థానం అధికారులు ప్రకటించారు. అనంతరం పూజారి వంశీయులు, మాజీ సర్పంచ్ లండ వెంకటరమణ మాట్లాడుతూ పండగ చాటింపు వేశారు. 2న పుట్టమన్ను తెచ్చుట, 3న ముత్యాలమ్మ పండుగ, 9న తొలేళ్ల పండుగ, 10 ప్రధాన పండుగ ఉంటుందన్నారు. 17న మారు వారం పండుగతో ఉత్సవాలు పూర్తి కానున్నాయని తెలిపారు. ఈ సభలో బీజేపీ, జనసేన, టీడీపీ, వైసీపీ వార్డు అధ్యక్షులు రచ్చా ఆనంద శ్రీనివాసవర్మ, మజ్జి సూరిబాబు, పంచదార్ల శ్రీనివాస్, కొలుసు ఈశ్వరరావు, అడివివరం సహకార పరపతి సంఘం పాలక మండలి అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, దేవస్థానం ఈఈ బండారు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా పోటీలు

డాబాగార్డెన్స్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): యోగా పోటీల్లో సచివాలయ స్థాయిలో నిలిచిన వారికి సోమవారం నుంచి ఈ నెల 7 వరకు మూడు కేటగిరీల్లో మండల స్థాయిలో పోటీల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసినట్లు సమగ్రశిక్షా అదనపు పథక సమన్వయకర్త జె. చంద్రశేఖరరావు తెలిపారు. ఎంపీడీవో ఛైర్మన్‌గా, ఎంఈవో-2, వివిధ స్థాయి అధికారులు, యోగా గురువులు పోటీలు నిర్వహిస్తారన్నారు. ఆనందపురం జెడ్పీహెచ్‌ఎస్, భీమునిపట్నం ఎంపీడీఓ ఆఫీస్, చినగదిలి జెడ్పీహెచ్‌ఎస్ తోటగరువు, గాజువాక జెడ్పీహెచ్ గోపాలపట్నం, మహారాణిపేట సెంట్రల్ పార్కు, ములగాడ జీవీఎంసీహెచ్‌ఎస్ మల్కాపురం, పద్మనాభం వెలుగు ఆఫీస్, పెదగంట్యాడ జెడ్పీహెచ్‌ఎస్ నడపూర్, పెందుర్తి జీహెచ్‌ఎస్ పెందుర్తి, సీతమ్మధార హిల్‌వ్యూ పార్కు కేంద్రాల్లో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు.

ఘనంగా గంటా నూకరాజు జన్మదిన వేడుకలు

భీమునిపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్ రోడ్డులో ఉన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. 3వ డివిజన్ నాయకుడు మారోజు సంజీవకుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నూకరాజును గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాసరపు నాగరాజు, మారోజు సంజీవకుమార్, కొక్కిరి అప్పన్న, గిడుతూరి శ్రీనివాసరావు, పుక్కళ్ల లక్ష్మీకుమారి, వాడమొదలు సత్యారావు, జలగడుగుల మురళి, యానాపు శ్రీను, జి. పోలిరాజు, అప్పికొండ నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.


నూకరాజుకు కేక్ తినిపిస్తున్న సంజీవకుమార్

'ఆంధ్రజ్యోతి' చొరవతో సమస్యలకు మోక్షం

... 5వ పేజీ తరువాయి

ఏపీఐఐసీ, విద్యుత్ శాఖాధికారులు హాజరయ్యారు. అక్కడి ప్రజలు చెప్పినవన్నీ విన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో అధికారులు వాటికి పరిష్కారం చూపించారు. డంపింగ్ యార్డుగా మారిన ఏపీఐఐసీ ఖాళీ స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. అక్కడ ఉన్న చెత్తను తరలిస్తున్నారు. అలాగే కాలనీలోకి వస్తున్న మురుగు నీటిని మళ్లించేందుకు డైవర్షన్ కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టారు. గెడ్డల్లో మురుగునీరు నిల్వ లేకుండా 15 రోజులకు ఒకసారి శుభ్రం చేస్తున్నారు. లోటల్టేజీ సమస్య పరిష్కారానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను వేశారు. అదేవిధంగా వడ్లపూడిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలాన్ని తహశీల్దార్, సిబ్బంది పరిశీలించి బోర్డులు పెట్టారు. ఆ స్థలంలో లైబ్రరీ, వృద్ధాశ్రమం నిర్మించే ఆలోచనలో ఎమ్మెల్యే ఉన్నారు. స్థానిక యువతకు క్రీడా సదుపాయం కోసం ఖాళీగా ఉన్న 4.5 ఎకరాల జీవీఎంసీ స్థలంలో రూ1.15 కోట్లతో ప్రహరీ నిర్మాణానికి హామీ ఇచ్చారు. కాలనీవాసులకు అందుబాటులో ఉండేలా ఆర్టీసీ అధికారులు బస్సును నడపబోతున్నారు. ఈమేరకు సోమవారం తిరుమలనగర్‌లోని ఆర్యవైశ్య సామాజిక భవన్‌లో 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో సభ జరగనున్నది. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య, కార్పొరేటర్ బొండా జగన్, జీవీఎంసీ జోనల్ కమిషనర్, ఐలా కమిషనర్, ఇతర అధికారులు పాల్గొనున్నారు. ముందుగా ఉదయం 9.30 గంటలకు కణితి మీ-సేవా కేంద్రం వద్ద ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తారు. అనంతరం అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. 10 గంటలకు సభలో పాల్గొంటారు.

తొట్లకొండపై యోగాంధ్ర

... 5వ పేజీ తరువాయి

ప్రత్యేక యోగాసనాల కార్యక్రమాన్ని ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు నిర్వహించారు. ఇందులో సుమారు వెయ్యి మంది పాల్గొని యోగాసనాలు వేశారు. ముందుగా మయన్మార్‌కు చెందిన బౌద్ధ గురువులు రాజదమ్మ, కాంబోడియాకు చెందిన బర్మథే, విశాఖ బౌద్ధ సంఘ సభ్యులు ధర్మాచారి, తదితరుల ప్రార్థనలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటారన్నారు. ప్రధాన వేదిక అయిన ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు యోగాసనాలు వేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. సుమారు ఐదు లక్షల మంది ప్రజలు ఇందులో భాగస్వాములు కానున్నారని పేర్కొన్నారు. యోగాసనాల ద్వారా ప్రపంచ రికార్డు నెలకొల్పేలా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో గల ట్రైనింగ్ సెంటర్‌లో వందమంది చొప్పున మూడు ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రజలకు యోగాసనాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. కాగా 21న జరిగే అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో పాల్గొనే వారి కోసం రవాణా సదుపాయాన్ని కల్పిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, భీమిలి ఆర్డీవో సంగీత మాథూర్, పలువురు జిల్లా అధికారులు, నావికాదళ అధికారులు, బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు, యోగా అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు బంగారమ్మ తొలేళ్ల పండగ

పద్మనాభం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో బంగారమ్మ అమ్మవారి పండగ సోమవారం జరగనుంది. ఇప్పటికే అమ్మవారి ఆలయంతో పాటు ఉప ఆలయాలైన ముత్యాలమ్మ, దుర్గాలమ్మ ఆలయాలను శుభ్రం చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గ్రామమంతా విద్యుద్దీపాలంకరణ చేశారు. గత నెల 26న నిర్వహించిన దేవర ఉత్సవంతో అమ్మవారి పండగకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి ప్రతిరోజూ అమ్మవారి మందిరం నుంచి జంగిడిని, ఘటాలను ప్రధాన వీధుల్లో ఊరేగిస్తున్నారు. కాగా తొలేళ్ల సందర్భంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు, సతకం పట్టు వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు., 3న అనుపోత్సవం సందర్భంగా ఉదయం దుర్గాలమ్మ అమ్మవారికి, పైడితల్లి అమ్మవారికి, పోతురాజుకు పసుపు, కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం కోలాటం, పులివేషాలు, శక్తి డ్యాన్సులు, కత్తిసాము, కర్రసాము వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో సంబరాన్ని నిర్వహిస్తారు. తాలాడ, బుగత, అవనాపు తదితర కుటుంబాలకు చెందిన వారు రథాన్ని అధిరోహించగా రాజవీధిలో ఊరేగిస్తారు. 4న కనుమతో ఉత్సవం ముగుస్తుంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పద్మనాభం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని బోని ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు సరఫరా నిలిపివేస్తామని ఆ శాఖాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పాండ్రంగి, సామయ్యవలస, మునివానిపేట గ్రామాలకు సరఫరా ఉండదని చెప్పారు.

రాష్ట్రంలో తొలి యాంటీ డ్రగ్ పార్కు

... 5వ పేజీ తరువాయి

ఉన్న సిటీ సెంట్రల్ పార్కులో సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.3.5 కోట్ల వ్యయంతో యాంటీ డ్రగ్ పార్కును ఏర్పాటు చేయనున్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే ఏమి జరుగుతుంది? అవి లేకుంటే జీవితం ఎంత అందంగా ఉంటుందో ఇక్కడ అర్థమయ్యేలా చెబుతారు. అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇస్తారు. దీనిని చికిత్సా కేంద్రంలా కాకుండా రోజూ ఆహ్లాదం కోసం పార్కుకు వచ్చినట్టు వచ్చి కొత్త జీవితం ప్రారంభించేలా చూస్తారు.

పార్క్ ఆఫ్ లైఫ్‌గా చెబుతాం

ప్రణవ్‌గోపాల్, వీఎంఆర్డీఏ ఛైర్మన్

ఇది పేరుకు యాంటీ డ్రగ్ పార్కు అయినా దీనిని మేము 'పార్క్ ఆఫ్ లైఫ్'గా చెబుతాం. మత్తుకు బానిసలైన వారిని అందులోనుంచి బయటకు తీసుకురావడమే కాకుండా, కొత్తగా ఎవరూ మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. యువగళం పాదయాత్ర సందర్భంగా వచ్చిన ఆలోచన ఇది. యువతను సన్మార్గంలో నడిపించాలన్నదే మా ప్రయత్నం.

మద్యం మత్తులో ఆటో డ్రైవర్ వీరంగం

భీమునిపట్నం (రూరల్), జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లవలస రహదారిపై ఆదివారం ఉదయం మద్యం మత్తులో ఆటో డ్రైవర్ వీరంగం సృష్టించాడు. పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. తాళ్లవలస సర్వీసు రోడ్డులో మద్యం సేవించిన ఆటో డ్రైవర్ వాహనాన్ని నిర్లక్ష్యంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడ్ని ఢీకొట్టాడు. ఆయన ప్రశ్నిస్తే దాడికి పాల్పడ్డాడు. కొందరు స్థానికులు వారించడానికి ప్రయత్నించగా వారిపై ఇనుప రాడ్డుతో దాడికి ప్రయత్నించాడు. పోలీసులకు సమాచారం తెలియడంతో సంఘటనా స్థలానికి వచ్చి ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మద్యం మత్తులో ఇద్దరి మధ్య ఘర్షణ

- మేడపై నుంచి నెట్టేయడంతో యువకుడి మృతి
- నిందితుడిపై కేసు నమోదు

మహారాణిపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి ఉన్న వ్యక్తి మేడపై నుంచి ఓ యువకుడ్ని నెట్టేయడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. లోతేటి హేమంత్ (24) చంగలరావుపేట ఏవీఎన్ కళాశాల సమీపంలో నివాసం ఉంటూ దొంగతనాలకు పాల్పడేవాడు. సమీపంలోని కాకర వీధిలో దోని సతీష్ (29) అనే రౌడీషీటర్ ఉంటున్నాడు. ఇద్దరి మధ్య కొంత కాలంగా విభేదాలున్నాయి. ఇటీవల సతీష్ ఇంట్లో హేమంత్ దొంగతనానికి పాల్పడడంతో ఇద్దరూ గొడవపడ్డారు. ఈ క్రమంలో గతనెల 29న రాత్రి 9 గంటల సమయంలో హేమంత్ మరో స్నేహితుడు పవన్‌తో కలసి ఏవీఎన్ కళాశాల సమీపంలోని సచివాలయ భవనంపై మద్యం తాగుతున్నారు. పవన్ ఏదో కొనుగోలు చేసేందుకు బయటకు వెళ్లిన సమయంలో హేమంత్ వద్దకు సతీష్ వచ్చాడు. ఇద్దరి మధ్య ఘర్షణ జరగ్గా, హేమంత్‌ను సతీష్ తోసేయడంతో ఒకటో అంతస్తు నుంచి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయమై రక్తస్రావం జరిగింది. అదే సమయంలో అక్కడకు చేరుకున్న పవన్ వెంటనే హేమంత్‌ను కేజీహెచ్‌కు తరలించాడు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి హేమంత్ మృతి చెందాడు, పోలీసులు సతీష్‌ను అదుపులోకి తీసుకోగా నేరం అంగీకరించడంతో అతనిపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.


వెంకోజీపాలెం : వృద్ధుల ఇంటికి రేషన్ పంపిణీ చేస్తున్న 15వ వార్డు కార్పొరేటర్ శ్రీవిద్య, కూటమి నేతలు


మద్దిలపాలెం : 22వ వార్డులోని రేషన్ డిపోలో సరకులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు


ఆరిలోవ : 10వ వార్డులో సరుకులు అందజేస్తున్న కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి


రామ్‌నగర్ : 28వ వార్డులో సరుకులు పంపిణీ ప్రారంభిస్తున్న నక్కా కనకరాజు

ఉత్సాహ వాతావరణంలో రేషన్ డిపోల్లో సరకుల పంపిణీ

» 1 నుంచి 15వ తేదీలోగా ఏ రోజైనా తెచ్చుకునే వెసులుబాటు » కష్టాలు తీరాయంటూ లబ్ధిదారుల హర్షం » కార్యక్రమాల్లో పాల్గొన్న కూటమి నేతలు

ఎంవీపీ కాలనీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డిపోల వద్దే సరుకుల పంపిణీ విధానానికి జనామోదం లభించింది. ప్రారంభమైన మొదటి రోజే లబ్ధిదారులు క్యూ కట్టారు. తూర్పు నియోజకవర్గం పరిధిలోని పద్దెనిమిదో వార్డులో మూడు డిపోల వద్దకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, కార్పొరేటర్ గొలగాని మంగవేణి పోలారావు తదితరులు ఆదివారం ఉదయం పంపిణీ ప్రారంభించారు. అలాగే సమీపంలోని వికలాంగులు, వృద్ధుల ఇళ్లకు వెళ్లి రేషన్ అందించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి భాస్కరరావు, సహాయ అధికారి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.


ఎంవీపీ కాలనీ : 18వ వార్డులో రేషన్ పంపిణీలో పాల్గొన్న సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, ఎమ్మెల్యే వెలగపూడి, కూటమి నేతలు


ఎంవీపీ కాలనీ : అప్పుఘర్ వద్ద చీకటి పడినా రేషన్ తీసుకోవడానికి బారులు తీరిన లబ్ధిదారులు

క్యూ కట్టిన కార్డుదారులు

ఇన్నాళ్లూ ఇంటి వద్దకే రేషన్ పంపిణీ అంటూ అట్టహాసంగా ప్రచారం చేసిన గత వైసీపీ ప్రభుత్వం వల్ల లబ్ధిదారులు చాలా ఇబ్బంది పడ్డారు. ఏ రోజున వాహనం వస్తుందో తెలియక యాతన అనుభవించేవారు. వాహనం రోడ్డుపై ఆగి ఉంటే, ఆ రోడ్డుపైనే గంటల కొద్దీ వరుసలో నిలబడలేక నీరసించిపోయేవారు. ఒక్కోసారి నెట్‌వర్క్ పని చేయక, తిరిగి ఇంటిముఖం పట్టాల్సి వచ్చేది. వాహనం వచ్చిన రోజు ఇంటి వద్ద లేకపోతే, ఏ చోట వాహనం ఉందో తెలుసుకుని, అక్కడకు వెళ్లాల్సి వచ్చేది. ఇన్ని ఇబ్బందులు ఒక్కసారిగా తొలగిపోవడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. తమకు అవకాశం ఉన్నప్పుడు డిపో వద్దకు వెళ్లి తెచ్చుకోవడానికి వీలవుతుందని అంటున్నారు. కూటమి ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకం మొదటి రోజునే లబ్ధిదారులు డిపోల వద్ద వరుస కట్టారు. జీవీఎంసీ 18వ వార్డులోని అప్పుఘర్ వద్ద రేషన్ డిపోలో రాత్రి ఏడు గంటల సమయంలోనూ జనం రేషన్ కోసం వేచి ఉన్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : విశాఖ తూర్పు నియోజకవర్గంలోని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆధ్వర్యంలో ఆదివారం రేషన్ డిపోల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు వృద్ధుల ఇంటికి వెళ్లి 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, టీడీపీ 15వ వార్డు అధ్యక్షులు బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, బోర ధనరెడ్డి, జనసేన 15వ వార్డు అధ్యక్షురాలు యడ్ల కళావతి ఇతర టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసి రేషన్ సరుకులను రేషన్ డీలరు అప్పలరాజు, లక్ష్మణ్, పాండుల సారధ్యంలో సరుకులను అందజేశారు. తొలుత డిపోలను కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య తిరిగి ప్రారంభించారు. రేషన్ డిపోల ద్వారా సరుకుల పంపిణీపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

16వ వార్డులో..

గ్రేటర్ విశాఖ 16వ వార్డులో రేషన్ దుకాణాలు ఆదివారం తిరిగి ప్రారంభమయ్యాయి. ఇకపై రోడ్లపై రేషన్ కోసం పడిగాపులు కాయాల్సిన అవసరం లేకుండా తమకు నచ్చిన సమయంలో నిర్ణీత రోజుల్లో ఏ రోజైనా రేషన్ సరుకులను పొందే అవకాశాన్ని కూటమి ప్రభుత్వం కల్పించడం పట్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఆదివారం టీడీపీ తూర్పు మహిళా అధ్యక్షురాలు పల్లా ఉమారాణి ఇసుకతోట ప్రాంతంలో రేషన్ దుకాణాలను తిరిగి ప్రారంభించారు. వృద్ధుల ఇంటికి వెళ్లి మరీ రేషన్ సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ 16వ వార్డు అధ్యక్షులు నారు గోపి, ముగడ వాసు, విశాఖ మార్కెటింగ్ కమిటీ సభ్యురాలు నారు శోభ, ఐటీడీపీ ఇంచార్జి పల్లాబాబు, మొల్లి శంకర్, బి.బంగార్రాజు పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో..

మద్దిలపాలెం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులో ఆదివారం తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ రేషన్ డిపోల్లో సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వార్డులోని 203, 204, 208 డిపోల్లో తెలుపుకార్డుదారులకు బియ్యం, కందిపప్పు, పంచదార అందించారు. అధికారులు సజావుగా రేషన్ పంపిణీ జరిగేటట్టు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీలో లబ్దిదారులు ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. పనులు మానుకుని వాహనాలు ఎప్పుడొస్తాయాని ఎదురు చేసేవారన్నారు. ఇప్పుడు ఆ సమస్య లేదని 15 రోజుల్లో ఎప్పుడన్న రేషన్ డిపోలకు వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, కోడిబోయిన ఆనంద్, బర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, జూన్1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ12వ వార్డులోని 228 డిపోలో కార్డుదారులకు రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను గురించి వివరించారను. కార్యక్రమంలో టీడీపీ 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, నాయకులు ఏడువాక సన్యాసిరావు. ఒమ్మి పోలారావు భరత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే 10వ వార్డులో స్థానిక కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి 552 డిపోలో రేషన్ సరుకులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయడు. ధనలక్ష్మి, కాళ్ల అప్పారావు, కృష్ణ పాల్గొన్నారు.

రామ్‌నగర్‌లో..

రామ్‌నగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 28వ వార్డులోని రామ్‌నగర్‌లో టీడీపీ క్లస్టర్ వార్డు ఇన్‌చార్జి నక్కా కనకరాజు రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా 1 వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో నాయకులు నడిగట్ల శంకరరావు నాగుల సన్యాసిరావు, ఉరుకూటి పైడిరాజు ఉసిరికాయల డిల్లీశ్వరి, డొకర శంకరరావు, సీహెచ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిలిప్పీన్స్ సదస్సుకు ఈపీడీసీఎల్ సీఎండీ

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు జరగనున్న ఆసియా క్లీన్ ఎనర్జీ ఫోరమ్ (ఏసీఈఎఫ్)-2025 సదస్సుకు ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ వెళుతున్నారు. ఈ పర్యటనకు అయ్యే మొత్తం వ్యయాన్ని ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ భరిస్తుంది. క్లీన్ ఎనర్జీపై ఏపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న నేపథ్యంలో అక్కడ చర్చకు వచ్చే అంశాలను రాష్ట్రంలో ఏ విధంగా ఉపయోగించుకోవచ్చో సూచిస్తూ పర్యటన తరువాత నివేదిక సమర్పించాలని ఆయనకు ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు సీఎండీ ఫిలిప్పీన్స్‌కు వెళుతున్నారు.

కరాటేతో స్వీయ రక్షణ, శారీరక ఆరోగ్యం

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : స్వీయ రక్షణతో పాటు శారీరక ఆరోగ్యానికి కరాటే ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. ఎంవీపీ కాలనీ అప్పుఘర్ సమీపంలోని పోలమాంబ పంక్షన్ హాలులో సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ పోటీలను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ప్రత్యేక అతిథిగా హాజరైన కార్పొరేటరు గొలగాని మంగవేణి పోలారావు మాట్లాడుతూ మహిళలు తమను తాము కాపాడుకోవడానికి ప్రతి ఆడపిల్ల కరాటే నేర్చుకోవాలని అన్నారు. జీవీఎంసీ 18వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు గొలగాని పోలరావు, రవిరాజు, ఎల్లాజీ, నిర్వాహకులు మాకరాజు, మువ్వల లక్ష్మి, బాలకృష్ణ, వినయ్, చిన్నారావు, శివశంకర్, రాధాకృష్ణ, శ్రీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కరాటే పోటీల ప్రారంభోత్సవంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

అయోధ్య మందిరంతో ట్రాఫిక్ ఇబ్బందులు


అయోధ్య మందిరం వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌కే బీచ్‌లో అయోధ్య రామ మందిరం ప్రదర్శన వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీన్ని చూడటానికి వారాంతాల్లో పెద్ద సంఖ్యలో జనాలు తరలివస్తున్నారు. వారితో పాటు రెగ్యులర్‌గా బీచ్‌కు వచ్చే వారి వల్ల రద్దీ ఏర్పడుతోంది. లోపల పార్కింగ్ సదుపాయం కల్పించకుండా భారీ ప్రదర్శన ఏర్పాటు చేయడంతో సందర్శకులు రోడ్డుపై వాహనాలు నిలిపివేసి వెళ్లిపోతున్నారు. బీచ్ రోడ్డు మొత్తం వాహనాలతో కిక్కిరిసిపోతోంది. ఇంకో రెండు నెలలు ఈ ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు ప్రకటించిన నేపథ్యంలో పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సినిమా గైడ్

- **భైరవం** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కరాటే కిడ్** : శారద
- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం)
- **ఫైనల్ డెస్టినేషన్** : రమాదేవి,
- **సింగిల్** : మెలోడి, కామేశ్వరి, గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 15, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 22, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 15, క్యారెట్ 38 దొండకాయలు 20, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది)54, బరబాటి 36, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోసకాయలు 14, వె ల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 34, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు


బ్యాగ్	
రైతు ధర	95
లైవ్ ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

నిబద్ధతతో కూడిన సేవలు గుర్తింపునిస్తాయి : ఏయూ వీసీ


సన్యాసిరావును సత్కరిస్తున్న వీసీ రాజశేఖర్

వెంకోజీపాలెం, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : నిబద్ధతతో ఉద్యోగులు అందించే సేవలు వారికి ప్రత్యేక గుర్తింపు అందిస్తాయని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఏయూ ఫైనాన్స్ అధికారిగా సేవలందించి పదవి విరమణ చేసిన వి.సూర్యారావును ఆయన ఘనంగా సత్కరించారు. ఆదివారం ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యారావు దంపతులను సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

23వ వార్డులో పూడికలు తొలగింపు


కాలువల్లో పూడికలు తొలగిస్తున్న దృశ్యం

మద్దిలపాలెం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 23వ వార్డులో శానిటేషన్ అధికారులు పూడికల తొలిగింపు చర్యలు చేపట్టారు. ఆదివారం వార్డులోని చైతన్యనగర్, కనకమ్మవారి వీధి, మద్దిలపాలెం ప్రాంతాల్లోని డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికలను ఎక్సకవేటర్లతో తొలగించారు. రోడ్ల మీద చెత్త, డంపర్‌బిన్‌లలో చెత్తను పారిశుధ్య కార్మికులు ఎత్తివేసి బ్లీచింగ్ చల్లారు. అలాగే మురుగు నీరు నిల్వలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడా రాజధానిగా విశాఖ : పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, పాల్గొన్న ది ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు

మద్దిలపాలెం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం క్రీడా రాజధానిగా అభివృద్ధి చెందుతోందని ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. మద్దిలపాలెంలోని కాకతీయ కన్వెన్సన్ హాలులో ఆదివారం నిర్వహించిన ది ఒలింపిక్ అసోసియేషన్ విశాఖపట్నం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో క్రీడా సౌకర్యాలు, శిక్షకులు పుష్కలంగా ఉన్నాయన్నారు. వాటిని సమన్వయం చేసుకుని నైపుణ్యం గత క్రీడాకారులను తయారుచేయడంలో క్రీడా సంఘాల పాత్ర కీలకమన్నారు. అన్నీ క్రీడా సంఘాలు కలిపి ఒలింపిక్ సంఘం ఏర్పాటు చేశారని, ఈ సంఘం ద్వారా మెగా ఈవెంట్లు నిర్వహిస్తామన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశాఖను నిలబెట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. చాలా సంఘాలు విలువైన సలహాలు, సూచనలు చేశాయన్నారు. దేశంలో బెస్ట్ స్పోర్ట్స్ పాలసీ రాష్ట్రానిది అయితే, రాష్ట్రంలో బెస్ట్ పాలసీ విశాఖదేనన్నారు. క్రీడల్లో విశాఖను ఫోకస్ చేసే విధంగా ఇక్కడ సంఘాలు పని చేయాలన్నారు. విద్యాశాఖమంత్రి నారా లోకేష్ కూడా క్రీడా రంగం, విద్య రెండు విభాగాలుగా పాఠశాల స్థాయి నుంచే ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నారని చెప్పారు. అందుకు తగిన విధంగా చర్యలు కూడా చేపడుతున్నారన్నారు. పాఠశాల వయసు నుంచే విద్యార్థులకు ఎటువంటి క్రీడలకు అనుకూలమవుతారో ఆయా క్రీడల్లో వారికి శిక్షణ కల్పించాలన్నారు. నగరంలో నిర్వహించే యోగాంధ్రకు కూడా క్రీడా సంఘాల పూర్తి మద్దతు తెలుపుతున్నాయన్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ గత అయిదేళ్ల క్రీడలు పడుకున్నాయని, ఇప్పుడు పూర్తి స్థాయిలో క్రీడలకు ప్రోత్సహం కల్పించి అభివృద్ధి చేస్తామన్నారు. బీచ్ స్పోర్ట్స్ ద్వారా టూరిజానికి కూడా ప్రాధాన్యం సంతరించుకుంటుందన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు డి.ప్రసన్నకుమార్, ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, ఇతర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన జల యోగాసనాలు

30 రకాల ఆసనాలు వేసిన డాక్టర్ యార్లగడ్డ గీతా శ్రీకాంత్



విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంఘ సేవకు రాలు, పారిశ్రామికవేత్త డాక్టర్ యార్ల గడ్డ గీతా శ్రీకాంత్ జల యోగాలో భాగంగా వివిధ యోగాసనాలు వేసి అబ్బురపరిచారు. ఆదివారం విశాఖ లోని స్పోర్ట్స్ ఎరీనాలో ఆర్ట్ లివింగ్, విశాఖ డిస్ట్రిక్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యం లో స్పోర్ట్స్, ఆయుష్ డిపార్ట్‌మెంట్ సంయుక్త సహకారంతో గంటపాటు జలయోగ ప్రదర్శన చేశారు. మొత్తం 30 రకాల ఆసనాలు వేసి సందర్శకులను అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ జల యోగా వల్ల శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. హిమాలయ యోగి ప్రభాకర్ గురూజీ.. జల యోగా ఉపయోగాలు, ప్లావని ప్రాణాయామం గురించి వివరించారు. అనంతరం గీతా శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ కృషితో యోగాను ప్రపంచ దినోత్సవంగా ప్రకటించిన తరువాత జల యోగాపై దృష్టి సారించానన్నారు.

నంబాల కేశవరావు పెద్దకర్మ నిర్వహణపై ఆంక్షలు అన్యాయం : ప్రజా వేదిక

సిరిపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : నంబాల కేశవరావుకు పెద్దకర్మ నిర్వహించడంపై ఆంక్షలు విధించడాన్ని ఖండిసున్నట్టు ప్రజా సంఘాల వేదిక సభ్యులు తెలిపారు. ఆదివారం సాయంత్రం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పౌర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణపూర్ జిల్లా గుండెకోట్ అటవీ ప్రాంతంలో హతమార్చిన కేశవరావుతో పాటు మరో నలుగురికి విప్లవ జోహార్లు తెలిపారు. పెద్ద కర్మ నిర్వహించడంపై కూడా ఆంక్షలు విధించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో మధ్య భారతంలో సాగిస్తున్న అమానూష చట్ట వ్యతిరేక హత్యాకాండ బయటపడుతుందనే ఉద్దేశంతోనే ఈ రకమైన దుర్మార్గానికి పూనుకున్నారన్నారు. పౌర ప్రజా సంఘాల నేతలు, జేవీసత్యనారాయణమూర్తి, ఎం.వెంకటేశ్వర్లు, కె.పద్మ, ఎం.లక్ష్మి. కె.లలిత, వై.కొండయ్య, బి.రామకృష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

4న జగన్ పాలనా విముక్తి దినం

» విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అప్పలనాయుడు

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది జూన్ 4న మాజీ ముఖ్యమంత్రి జగన్ పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించడంతో ఆ రోజుని జగన్ పాలనా విముక్తి దినంగా ప్రకటిస్తున్నామని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన నగరంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన తీర్పు పట్ల జగన్‌కు గౌరవం లేదని విమర్శించారు. ప్రజలు తీర్పు ఇచ్చే రోజును వెన్నుపోటు దినంగా ప్రకటించడంలోనే ఆయన వ్యక్తిత్వం తెలుస్తుందని ఎద్దేవా చేశారు. కడపలో మహానాడు నిర్వహించకూడదని ఆ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇప్పించిన ఘనత జగన్‌దేనని చెప్పారు. వైసీపీ కార్యక్రమాలను టీడీపీ ఏనాడైనా అడ్డుకుందా అని ప్రశ్నించారు. కడపలో మహానాడు అద్భుతంగా జరిగిందని, రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది తరలివచ్చారని చెప్పారు. కడప ప్రజలు కూడా మహానాడులో ఎంతో ఆనందంగా పాల్గొన్నారన్నారు. రాష్ట్రంలో కూటమి పాలన ఎంతో చక్కగా సాగుతుందని, ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టిసారిస్తున్నారని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు టీడీపీ విశాఖ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని మోహన్ ఉన్నారు.

ఆశ్రమ స్థల వివాదంలో వైసీపీ నాయకుడి అరెస్టు


పోలీసులు అరెస్టు చేసిన జీవీ రామచంద్రరావు

ఎంవీపీ కాలనీ, మే 1 (ఆంధ్రజ్యోతి) : లాసన్స్ బే కాలనీ వద్దనున్న శాంతి ఆశ్రమం విషయంలో రెండు వర్గాల మధ్య నడుస్తున్న వివాదంలో ఇప్పటికే పలువురు రౌడీ షీటర్లను అరెస్టు చేసిన ఎంవీపీ పోలీసులు తాజాగా వైసీపీ నాయకుడిని అరెస్టు చేసి జైలుకు పంపించారు. భూ వివాదంలో రౌడీ షీటర్లు తలదూర్చి శాంతిభద్రతలకు భంగం కలిగించడంతో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సీరియస్‌గా తీసుకున్నారు. ఈ వివాదంలో రెండు వర్గాలు రౌడీ షీటర్లను రంగంలోకి దించడంతో, వారిని అరెస్టు చేసి జైలుకు పంపించడానికి సీపీ.. టాస్క్‌ఫోర్స్‌ను రంగంలోకి దించారు. కొద్ది రోజులుగా ఈ అరెస్టుల పర్వం కొనసాగుతోంది. కాగా ఈ వివాదంలో రౌడీ షీటర్లను రంగంలోకి దించడానికి తూర్పు నియోజకవర్గం వైసీపీలో చురుగ్గా తిరుగుతున్న జీవీ రామచంద్రరావును ఆదివారం పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. అయితే అరెస్టు చేసింది వైసీపీ నాయకుడినే అయినా ఎంవీపీ పోలీసులు మాత్రం గోప్యత పాటిస్తున్నారు. అతడిని విచారణ నిమిత్తం శనివారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించినప్పుడే సీఐని విలేకరులు ప్రశ్నించగా, అతడికి ఈ కేసుకు సంబంధం లేదని చెప్పుకొచ్చారు. కానీ, ఆదివారం అతడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినా విషయాన్ని మాత్రం గోప్యంగా ఉంచడం వెనుక పోలీసులు అంతర్యమేమిటో అర్థం కావడం లేదన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

ఇరువర్గాలు రౌడీ షీటర్లతో ఘర్షణలు జరిగినప్పుడే ఇది న్యాయస్థానం పరిధిలోని అంశమని, ఇందులో తీవ్రత లేదన్నట్టుగా సీఐ తేలిగ్గా తీసిపారేశారు. సీపీ ప్రత్యేక దృష్టి సారించడంతో ఇప్పుడు అరెస్టులు తప్పలేదు. వైసీపీ నాయకుడి పాత్రపై ముందు నుంచీ అనుమానాలు ఉన్నప్పటికీ పోలీసులు పెద్దగా పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. రౌడీ షీటర్లతో రామచంద్రరావు మంతనాలు జరిపినట్టు పోలీసుల వద్ద ఫోన్ రికార్డింగులు ఉన్నట్లు సమాచారం. దీంతో ఈ కేసులో అతడిని కీలక నిందితుడిగా చేర్చినట్టు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటి వరకూ 24 మందిని అరెస్టు చేశారు.

నేటి నుంచి ఇంటర్ తరగతులు

మద్దిలపాలెం, జూన్1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం నుంచి ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభం కానున్నాయి. వేసవి విరామం తర్వాత నేటి నుంచి జూనియర్ కళాశాలలు తెరుచుకుంటున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలను బలోపేతం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు చేసింది. ఇందులో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచే విద్యాసంవత్సరం ప్రారంభించింది. కనీసం 15 శాతం సిలబస్ పూర్తి చేసే విధంగా 23 రోజులు క్లాసులు నిర్వహించారు. ఏప్రిల్ 24 నుంచి మే 31 వరకు వేసవి సెలవులు ఇచ్చారు. సెలవులు ముగియడంతో సోమవారం నుంచి క్లాసులు ప్రారంభిస్తున్నారు.

అలాగే ఏప్రిల్ 7 నుంచే ప్రథమ సంవత్సరం ప్రవేశాలు ప్రారంభించారు. మళ్లీ జూన్ 1 నుంచి ప్రథమ సంవత్సరం రెండో విడత ప్రవేశాలు చేపట్టనున్నారు.

మహానాడులో టీడీపీ సిద్ధాంతాలు ఆవిష్కృతం : వీఎంఆర్డీఏ చైర్మన్

సిరిపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ తమ పార్టీ సిద్ధాంతాలను నూతనత్వం ఇచ్చి ప్రజలకు మరింత చేరవయ్యేందుకు చేస్తున్న ప్రయత్నాలు కడప మహానాడులో ఆవిష్కృతమయ్యాయని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు. 6 శాసనాల ద్వారా పార్టీ భవిష్యత్ ఆలోచనలు, ప్రణాళికలు ప్రజలకు టీడీపీ వివరించిందన్నారు. రాష్ట్రంలో నాలుగు చోట్ల జరిగిన వేర్వే ఘటనలు వైసీపీ రాక్షస సిద్ధాంతాన్ని వారి డీఎన్ఏలో ఉన్న క్రిమినల్ మైండ్‌ను ఆవిష్కృతం చేస్తున్నాయని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలలో అనేక అపచారాలకు వైసీపీ పాల్పడిందన్నారు

మాంసం దుకాణదారులపై కేసు నమోదు

» కుళ్లిన మేక తలకాయ మాంసం విక్రయంతో చర్యలు

ఆరిలోవ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షనులో కుళ్లిన మేక తలకాయలను విక్రయిస్తున్న వారిపై 9వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అన్నాజీరావు అపరాధ రుసుం విధించడంతో పాటు కేసులు నమోదు చేశారు. ఆదివారం శానిటేషన్ లో భాగంగా హనుమంతవాక పాత కబేలా వద్ద విక్రయిస్తున్న మాంసాలను తలకాయలను పరిశీలించారు. వాటిలో నిలువ ఉంచిన, కుళ్లిన తలకాయలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకొని ఫినాయిల్ చల్లి పూడ్చిపెట్టారు. ఇకపై ఇటువంటివి అమ్మినట్టయితే తీవ్రమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే సహించేది లేదంటూ హెచ్చరించారు.

ఉపాధ్యాయుల బదిలీల్లో వీడని గందరగోళం

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల బదిలీల్లో గందరగోళం కొనసాగుతోంది. కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించాలన్న ప్రభుత్వ నిర్ణయమే దీనికి కారణమన్న వాదన ఉపాధ్యాయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించడాన్ని ఎస్‌జీటీలు వ్యతిరేకిస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలకు పని భారం ఎక్కువగా ఉంటుంది. ఇప్పటివరకు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు బోధన చేసిన స్కూల్ అసిస్టెంట్లు, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంగా వెళితే మూడు నుంచి ఐదు తరగతులకు బోధన చేయడం ఏమిటన్న వాదన వారిలో ఉంది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో సర్దుబాటుతో మిగిలిన స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలుగా నియమిస్తున్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో హెచ్ఎంలుగా వెళ్లేందుకు పలువురు స్కూల్ అసిస్టెంట్లు సమ్మతించినా.. ఏజెన్సీలో మారుమూల ప్రాంతాలకు వెళ్లడానికి విముఖత చూపుతున్నారు. ఆదివారం సాయంత్రంతో ప్రాథమిక పాఠశాలలకు హెచ్ఎంలుగా వెళ్లడానికి స్కూల్ అసిస్టెంట్లకు ఇచ్చిన గడువు ముగిసింది. మొత్తం 563 పాఠశాలల్లో ఇంకా 26 పాఠశాలలకు ఎవరూ ఆప్షన్ ఇవ్వలేదు. దీంతో మిగులుగా ఉన్న 86 మంది స్కూల్ అసిస్టెంట్లలో 26 మందిని ఏజెన్సీకి పంపనున్నారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించి వారిని ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలుగా పంపితే మంచిదని ఎస్టీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు అభిప్రాయపడ్డారు.

అట్టహాసంగా రేషన్ దుకాణాలు ప్రారంభం

» ప్రతినెలా 15 రోజులు సరకుల పంపిణీ » కూటమి నాయకుల సందడి » తొలిరోజు మొరాయించిన సర్వర్లు » కార్డుదారుల నిరీక్షణ



రేషన్ సరకుల పంపిణీ ప్రారంభిస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, కూటమి నాయకులు



సీతమ్మధారలో రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ తదితరులు

మహారాణిపేట/సీతమ్మధార/కంచరపాలెం/మురళీనగర్/అక్కయ్యపాలెం/ అల్లిపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ, ఉత్తర నియోజకవర్గాల్లో కూటమి పార్టీ నేతల ఆధ్వర్యంలో రేషన్ డిపోల ద్వారా సరుకుల పంపిణీని ఆదివారం అట్టహాసంగా ప్రారంభించారు. ప్రజలు వీలైనప్పుడు వచ్చి సరుకులు తీసుకునే వెసులుబాటు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డిపోలను పునఃప్రారంభించింది. దక్షిణ నియోజకవర్గంలో శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, జనసేన నాయకుడు శివప్రసాద్ రెడ్డి, కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, గోడి విజయలక్ష్మి నరసింహాచారి తదితరుల ఆధ్వర్యంలో 29, 30, 35, 37, 38 వార్డులతో పాటు పూర్ణామార్కెట్, కోటవీధి, వెలంపేట, మహారాణిపేట తదితర ప్రాంతాల్లో కూటమి నాయకులు డిపోల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రేషన్ షాపులను నిస్తేజంగా మార్చడంతో కూటమి ప్రభుత్వం వాటికి పునర్జీవం కల్పించిందని, ప్రతీ నెల 1 నుంచి 15వ తేదీ వరకు తెరిచి ఉంచుతారన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య, మళ్లీ సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజలు ఎప్పుడు వీలైతే అప్పుడు వచ్చి సరుకులు తీసుకోవచ్చన్నారు. చాలాకాలం తరువాత రేషన్ షాపులలో తిరిగి మిషన్లు రావటం, ఒక్కసారిగా దాదాపు 30 వేల మిషన్లు ప్రారంభించటంతో సర్వర్లు మొరాయించాయి. దీనితో సరుకులు తీసుకోవటానికి వచ్చినవారు ఇబ్బందులకు గురయ్యారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు. ఏ రేషన్ డిపో వద్దనైనా రేషన్ తీసుకునే విధానాన్ని తీసుకురావడంతో అందరు ఎక్కడున్నా ఆయా ప్రాంతాల్లో రేషన్ తీసుకోవచ్చని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ 24వ వార్డులో రేషన్ డిపోను రిబ్బన్ కట్ చేసి వారు ప్రారంభించారు. సాంకేతిక మార్పులతో పాటు సరకులు పంపిణీని సౌకర్యవంతంగా చేయడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, కూటమి నాయకులుపాల్గొన్నారు. 47వవార్డులో కప్పరాడ రేషన్ దుకాణం ద్వారా లబ్దిదారులకు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సరకులను అందజేశారు. దుబారా ఖర్చులు నివారించడానికి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను రద్దు చేసిందన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు సరకులను ఇళ్లవద్దకే అందించనున్నట్టు తెలిపారు. కార్పొరేటర్ కామేశ్వరి, కూటమి నాయకులు పసుపులేటి ఉషాకిరణ్, నజీర్, ఈతలపాక సుజాత, ఆర్.రాంబాబు, అరుణ్, అరుణ పాల్గొన్నారు. 48వవార్డులో టీడీపీ నాయకుడు గొర్లె అప్పారావు, 55వ వార్డులో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఈతలపాక సుజాత, 54వ వార్డులో ఉత్తర జనసేన నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్ పేదలకు సరకులను అందజేశారు. పేదలకు రేషన్‌ను పారదర్శకంగా అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వాహనాలను నిలిపివేిందని, ప్రజలకు



14వ వార్డులో రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ అధ్యక్షుడు పరశురామరాజు

ఇబ్బందులు లేకుండా డిపోల ద్వారా సరకులు అందిస్తామని కార్పొరేటర్లు బీశెట్టి వసంతలక్ష్మి, కందుల నాగరాజు అన్నారు. 32, 33 వార్డులలో రేషన్ దుకాణాలను ప్రారంభించారు. 14వ వార్డులో రేషన్ దుకాణాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరుశురామ్ రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సరికొత్త నిర్ణయంతో ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15 తేదీ వరకు రేషన్ షాపుల ద్వారా నిత్యవసర సరకుల పంపిణీ జరుగుతుందన్నారు. అక్కయ్యపాలెం పరిధిలోని గ్రేటర్ 26, 27, 42, 43, 44, 45, 46 వార్డుల్లోని రేషన్ డిపోలు పునఃప్రారంభమయ్యాయి. మాధవధారలో 53వ డిపో డీలర్ భాస్కరరావు చేపట్టిన సరఫరాలో టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, బీజేపీ, జనసేన ప్రతినిధులు పాల్గొన్నారు. బర్మాక్యాంప్, ఎన్‌జీజీఓస్ కాలనీ ప్రాంతాల్లో రేషన్ పంపిణీ చేశారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కానిస్టేబుళ్ల నియామకాలకు సంబంధించిన మెయిన్స్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని 27 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 12,491 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 11,338 (90.76 శాతం) మంది హాజరయ్యారు. ఆయా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 8 గంటలు నుంచే అభ్యర్థులు బారులుతీరారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరిగింది. జిల్లాలోని పరీక్ష కేంద్రాలకు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే లోపలకు అనుమతించారు. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల ఉన్న జిరాక్స్ సెంటర్లను పోలీస్ అధికారులు మూసివేయించారు. కాగా పలు కేంద్రాలను నగర ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, డీసీపీలు అజిత వేజెండ్ల, డి.మేరీప్రశాంతి, శ్రీకృష్ణకాంత్‌లు పరిశీలించారు.

రేషన్ డిపోల్లో సందడి

(5వ పేజీ తరువాయి)

మందికి పంచదార పంపిణీ చేశారు. కాగా కొన్నిచోట్ల మాత్రమే కందిపప్పును పంపిణీ చేయడం జరిగింది.

సర్వర్ మొరాయింపు

ఆదివారం ఉదయం నుంచి జిల్లాలోని 642 డిపోల్లో ఒకేసారి సరకుల పంపిణీ ప్రారంభమైంది. ఇంకా రాష్ట్రంలో వేల డిపోల్లో సరకుల పంపిణీకి డీలర్లు ప్రయత్నించడంతో సర్వర్ మొరాయించింది. నెట్‌వర్క్ ఎర్రర్ అని, మరోసారి ప్రయత్నించండి అంటూ ఈ పోస్ మిషన్‌పై చూపించడంతో కార్డుదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో గంటకు పదికి మించి కార్డుదారులకు సరకులు ఇవ్వడానికి డీలర్లు ప్రయత్నించాల్సి వచ్చింది. ఎండ తీవ్రతతో కార్డుదారులు అసౌకర్యానికి గురయ్యారు. ఆదివారం సెలవు రోజు కావడంతో సర్వర్ సమస్యను పరిష్కరించడానికి వీలుకావడం లేదని అధికారులు వివరించారు. ఒకేసారి వేలమంది డీలర్లు లాగిన్ కావడంతో సమస్య ఉత్పన్నమైందని, రెండు మూడు రోజులల్లో అంతా సర్దుకుంటుందన్నారు.

రేషన్ కోసం నిరీక్షణ



రైల్వేన్యూకాలనీలోని 39వ డిపో వద్ద వేచి ఉన్న కార్డుదారులు

అక్కయ్యపాలెం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీలోని పలు రేషన్ డిపోల్లో ఉదయం 8 గంటలకు ప్రారంభమవ్వాల్సిన రేషన్ సరుకుల పంపిణీ ఆలస్యమైంది. డిపోలను ప్రారంభించాల్సిన నాయకులు రాకపోవడంతో కార్డుదారులు డిపోల వద్దే చాలా సేపు పడిగాపులు కాశారు. మొదటి రోజు కావడంతో సర్వర్ కూడా కొద్దిసేపు మొరాయించింది. 9-30 గంటలైనా రేషన్ సరుకుల పంపిణీ అవ్వక పోవడంతో కార్డుదారులు నిరుత్సాహంతో అసహనం వ్యక్తం చేశారు. తాము వివిధ ప్రాంతాల నుంచి రేషన్ సరుకుల కోసం వస్తే ఇక్కడ ఇవ్వకుండా నాయకుల కోసం వేచి ఉండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఎండీయూ రేషన్ వాహనాల వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని, మరల ప్రస్తుతం కూడా ఇలా వేచి ఉండడం సరైన పద్ధతి కాదంటున్నారు. ఇకపై ఇలా ఆలస్యం చేయకుండా సకాలంలో రేషన్ సరుకులు అందించేలా తగు చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.

'ఆంధ్రజ్యోతి' చొరవతో సమస్యలకు మోక్షం

(5వ పేజీ తరువాయి)

ఏపీఐఐసీ, విద్యుత్ శాఖాధికారులు హాజరయ్యారు. అక్కడి ప్రజలు చెప్పినవన్నీ విన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో అధికారులు వాటికి పరిష్కారం చూపించారు. డంపింగ్ యార్డుగా మారిన ఏపీఐఐసీ ఖాళీ స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. అక్కడ ఉన్న చెత్తను తరలిస్తున్నారు. అలాగే కాలనీలోకి వస్తున్న మురుగు నీటిని మళ్లించేందుకు డైవర్షన్ కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టారు. గెడ్డల్లో మురుగునీరు నిల్వ లేకుండా 15 రోజులకు ఒకసారి శుభ్రం చేస్తున్నారు. లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను వేశారు. అదేవిధంగా వడ్లపూడిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలాన్ని తహశీల్దార్, సిబ్బంది పరిశీలించి బోర్డులు పెట్టారు. ఆ స్థలంలో లైబ్రరీ, వృద్ధాశ్రమం నిర్మించే ఆలోచనలో ఎమ్మెల్యే ఉన్నారు. స్థానిక యువతకు క్రీడా సదుపాయం కోసం ఖాళీగా ఉన్న 4.5 ఎకరాల జీవీఎంసీ స్థలంలో రూ1.15 కోట్లతో ప్రహరీ నిర్మాణానికి హామీ ఇచ్చారు. కాలనీవాసులకు అందుబాటులో ఉండేలా ఆర్టీసీ అధికారులు బస్సును నడపబోతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం తిరుమలనగర్‌లోని ఆర్యవైశ్య సామాజిక భవన్‌లో 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో సభ జరగనున్నది. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య, కార్పొరేటర్ బొండా జగన్, జీవీఎంసీ జోనల్ కమిషనర్, ఐలా కమిషనర్, ఇతర శాఖల అధికారులు పాల్గొంటున్నారు. ముందుగా ఉదయం 9.30 గంటలకు కణితి మీ-సేవా కేంద్రం వద్ద ఆర్టీసీ బస్సును జెండా ఊపి ప్రారంభిస్తారు. అనంతరం అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. పది గంటలకు సభలో పాల్గొని స్థానికులతో ముచ్చటిస్తారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

(5వ పేజీ తరువాయి)

పెందుర్తిలో ఉంటున్న మద్దాల శ్రీరామ్ (17) స్నేహితులు. శ్రీరామ్ ఇటీవల ఇంటర్ పూర్తి చేసి ఇంజనీరింగ్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నాడు. వీరిద్దరూ కలిసి ఆదివారం సాయంత్రం ఫొటో షూట్ కోసం వేరే స్నేహితుడి నుంచి బైకు తీసుకుని బయలుదేరారు. ఎన్‌హెచ్-16 రోడ్డు సరిపల్లి ఆర్వోబీ మీదుగా అవినాశ్ బైకును నడుపుతుండగా ఒక్కసారిగా కుక్క అడ్డు రావడంతో వాహనాన్ని అదుపు చేయలేక సమీపంలో గల డివైడర్‌ను బలంగా ఢీకొన్నాడు. దీంతో వాహనం నుజ్జవ్వడంతో పాటు వారిద్దరూ రోడ్డుపై ఎగిరిపడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాపాయం తప్పేదని స్థానికులు పేర్కొంటున్నారు. సమాచారం అందుకున్న వెంటనే సీఐ సతీశ్‌కుమార్, ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో తొలి యాంటీ డ్రగ్ పార్కు

(5వ పేజీ తరువాయి)

ఉన్న సిటీ సెంట్రల్ పార్కులో సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.3.5 కోట్ల వ్యయంతో యాంటీ డ్రగ్ పార్కును ఏర్పాటు చేయనున్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే ఏమి జరుగుతుంది? అవి లేకుంటే జీవితం ఎంత అందంగా ఉంటుందో ఇక్కడ అర్థమయ్యేలా చెబుతారు. అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇస్తారు. దీనిని చికిత్సా కేంద్రంలా కాకుండా రోజూ ఆహ్లాదం కోసం పార్కుకు వచ్చినట్టు వచ్చి కొత్త జీవితం ప్రారంభించేలా చూస్తారు.

పార్క్ ఆఫ్ లైఫ్‌గా చెబుతాం

ఇది పేరుకు యాంటీ డ్రగ్ పార్కు అయినా దీనిని మేము 'పార్క్ ఆఫ్ లైఫ్'గా చెబుతాం. మత్తుకు బానిసలైన వారిని అందులోనుంచి బయటకు తీసుకురావడమే కాకుండా, కొత్తగా ఎవరూ మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. యువగళం పాదయాత్ర సందర్భంగా వచ్చిన ఆలోచన ఇది. యువతను సన్మార్గంలో నడిపించాలన్నదే మా ప్రయత్నం.

-ప్రణవ్‌గోపాల్, వీఎంఆర్డీఏ చైర్మన్

మద్యం మత్తులో ఇరువురి మధ్య ఘర్షణ

» మేడపై నుంచి నెట్టేయడంతో చికిత్స పొందుతూ యువకుడు మృతి

» నిందితుడిపై హత్య కేసు నమోదు

మహారాణిపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి ఉన్న వ్యక్తి మేడపై నుంచి ఓ యువకుడిని నెట్టేయడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లోతేటి హేమంత్ (24) అనే యువకుడు చంగలరావుపేట ఏవీఎన్ కళాశాల సమీపంలో నివాసం ఉంటూ దొంగతనాలకు పాల్పడేవాడు. సమీపంలోని కాకర వీధిలో దోని సతీష్ (29) అనే రౌడీషీటర్ ఉంటున్నాడు. ఇద్దరి మధ్య కొంత కాలంగా విభేదాలున్నాయి. ఇటీవల సతీష్ ఇంట్లో హేమంత్ దొంగతనానికి పాల్పడటంతో ఇద్దరూ గొడవ పడ్డారు. ఈ క్రమంలో మే 29న రాత్రి 9 గంటల సమయంలో హేమంత్ మరో స్నేహితుడు పవన్‌తో కలసి ఏవీఎన్ కళాశాల సమీపంలోని సచివాలయ భవనంపై మద్యం తాగుతున్నారు. ఈ క్రమంలో పవన్ ఏదో కొనుగోలు చేసేందుకు బయటకు వెళ్లిన సమయంలో హేమంత్ వద్దకు సతీష్ వచ్చాడు. ఇద్దరి మధ్య ఘర్షణ జరగ్గా, హేమంత్‌ను సతీష్ తోసేయటంతో ఒకటో అంతస్తు నుంచి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయమై రక్తస్రావం జరిగింది. అదే సమయంలో అక్కడకు చేరుకున్న పవన్ వెంటనే హేమంత్‌ను కేజీహెచ్‌కు తరలించాడు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి హేమంత్ మృతి చెందాడు. పోలీసులు నిందితుడు సతీష్‌ను అదుపులోకి తీసుకోగా నేరం అంగీకరించటంతో అతనిపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి

ఆనందపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పందలపాక గ్రామంలో విద్యుదాఘాతంతో బాలిక మృతి చెందింది. సీఐ చింతా వాసునాయుడు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన గండిమాని రంగా కల్లుగీత కార్మికుడు. ఆయన కుమార్తె సాయి మేఘన (12) ఆనందపురంలోని ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. ఆదివారం ఉదయం ఇంట్లోని మోటారు వేయడానికి వెళ్లగా షార్ట్ సర్క్యూట్ వల్ల షాక్‌కు గురైంది. వెంటనే తల్లిదండ్రులు ఆమెను తగరపువలసలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఉన్న ఒక్కగాను ఒక్క కుమార్తె విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

మద్యం మత్తులో స్పృహ కోల్పోయి డ్రైవర్ మృతి

లంకెలపాలెం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఫూటుగా మద్యం సేవించి ఓ డ్రైవర్ మృతిచెందిన సంఘటన లంకెలపాలెం ఫ్లైఓవర్ వద్ద చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలివి. విశాఖపట్నానికి చెందిన జి.ధనపాల్ బాలాజీ (55) ఫార్మాసిటీలో ఓ వాహనానికి ఆఫ్టింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఫూటుగా మద్యం సేవించి ఇక్కడున్న బ్రిడ్జి వద్ద స్పృహ కోల్పోయి పడిపోయాడు. ఎంతటికీ తెలివి రాకపోవడంతో స్థానికులు పరవాడ పోలీసులు సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా, అప్పటికే మృతిచెందిన ఉన్నట్టు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిని పూర్తి వివరాలకు తెలియాల్సి ఉందనిసీఐ మల్లికార్జునరావు తెలిపారు.

'మహారాజా బ్యాంకు సేవలు మరింత విస్తరించాలి'



కేంద్ర మాజీమంత్రి అశోక్ గజపతిరాజును సత్కరిస్తున్న అతిథులు, చిత్రంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తదితరులు

డాబాగార్డెన్స్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్న ది మహారాజా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ భవిష్యత్‌లో మరింతగా సేవలను విస్తరింపజేయాలని కేంద్ర మాజీమంత్రి అశోక్ గజపతిరాజు ఆకాంక్షించారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో జరిగిన బ్యాంకు 25వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ నిజాయతీ, నిబద్ధతతో పనిచేసే సంస్థలు కొన్ని సందర్భాల్లో ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ, వాటిని అధిగమించి ప్రగతి సాధిస్తున్నాయన్నారు. బ్యాంక్ వ్యవస్థాపక చైర్మన్ ఎం.రామకృష్ణరాజు మాట్లాడుతూ బ్యాంకు రూ.500 కోట్ల టర్నోవర్‌కు చేరుకుందన్నారు. రూ.300 కోట్లు డిపాజిట్లు, రూ.200 కోట్ల రుణాలు అందజేసినట్టు వివరించారు. 14 శాతం డివిడెంట్ అందజేస్తున్నట్టు తెలిపారు. సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ సహకార రంగంపై పూర్తి అవగాహనతో నడపడం వలన మహారాజా బ్యాంకు వృద్ధి సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ, గుత్తి, గుంటూరు కో-ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులు చిట్టూరి రవీంద్ర, జిలానీ, జి.శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వివిధ కో-ఆపరేటివ్ బ్యాంక్‌ల చైర్మన్‌లు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న పంచాయతీరాజ్ శాఖ కమిషనర్



రేవు ముత్యాలరాజు దంపతులకు స్వామి చిత్రపటం బహూకరణ

సింహాచలం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ రేవు ముత్యాలరాజు కుటుంబ సమేతంగా వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న కమిషనర్ గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి, శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

రౌడీషీటర్లకు హెచ్చరిక

సీతంపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు ఆటంకం కల్పించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని నాలుగో పట్టణ ఎస్‌ఐ చిన్నం నాయుడు రౌడీషీటర్లను హెచ్చరించారు. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్, ద్వారకా పోలీసు స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లకు స్టేషన్ సీఐ రమణ, సత్యనారాయణల ఆధ్వర్యంలో ఎస్‌ఐలు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అందరితో వ్యక్తిగతంగా మాట్లాడుతూ ఎవరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ఎటువంటి గొడవలకు దిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం: విష్ణుకుమార్‌రాజు



క్రీడాకారులతో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

మాదవధార, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 50వవార్డులో నిర్వహించిన రోల్‌బాల్ స్కేటింగ్ వేసవి శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. మే నెల మొత్తం బాలబాలికలకు శిక్షణ ఇచ్చారు. ఆదివారం జరిగిన ముగింపు సమావేశంలో ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు హాజరై బాలలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి క్రీడాకారులకు ఎప్పుడూ ప్రోత్సాహం ఉంటుందన్నారు. కోచ్‌లు, సీనియర్లు మెరుగైన ఫలితాల కోసం బాలలకు మరింతగా తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమానికి రోల్‌బాల్ స్కేటింగ్ కోచ్ సంతోష్, రోల్‌బాల్ స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, వైశాఖీ స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, కమిటీ సభ్యులు, స్థానికులు, క్రీడాకారుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

4న జగన్ పాలనా విముక్తి దినం: ఎంపీ కలిశెట్టి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది జూన్ 4న మాజీ ముఖ్యమంత్రి జగన్ పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించడంతో ఆ రోజును జగన్ పాలనా విముక్తి దినంగా ప్రకటిస్తున్నామని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన తీర్పు పట్ల జగన్‌కు గౌరవం లేదని విమర్శించారు. ప్రజలు తీర్పు ఇచ్చే రోజును వెన్నుపోటు దినంగా ప్రకటించడంలోనే ఆయన వ్యక్తిత్వం తెలుస్తుందని ఎద్దేవా చేశారు. కడపలో మహానాడు నిర్వహించకూడదని ఆ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇప్పించిన ఘనత జగన్‌దేనని చెప్పారు. వైసీపీ కార్యక్రమాలను టీడీపీ ఏనాడైనా అడ్డుకుందా అని ప్రశ్నించారు. కడపలో మహానాడు అద్భుతంగా జరిగిందని, రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది తరలివచ్చారని చెప్పారు. అక్కడి ప్రజలు కూడా మహానాడులో ఎంతో ఆనందంగా పాల్గొన్నారన్నారు. రాష్ట్రాభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిసారిస్తున్నారని తెలిపారు. టీడీపీ విశాఖ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని మోహన్ ఉన్నారు.

తొట్లకొండపై యోగాంధ్ర

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేక యోగాసనాల కార్యక్రమాన్ని ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు నిర్వహించారు. ఇందులో సుమారు వెయ్యి మంది పాల్గొని యోగాసనాలు వేశారు. ముందుగా మయన్మార్‌కు చెందిన బౌద్ధ గురువులు రాజదమ్మ, కాంబోడియాకు చెందిన బర్మరే, విశాఖ బౌద్ధ సంఘ సభ్యులు ధర్మాచారి, తదితరుల ప్రార్థనలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటారన్నారు. ప్రధాన వేదిక అయిన ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు యోగాసనాలు వేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. సుమారు ఐదు లక్షల మంది ప్రజలు ఇందులో భాగస్వాములు కానున్నారని పేర్కొన్నారు. యోగాసనాల ద్వారా ప్రపంచ రికార్డు నెలకొల్పేలా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో గల ట్రైనింగ్ సెంటర్‌లో వందమంది చొప్పున మూడు ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రజలకు యోగాసనాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. కాగా 21న జరిగే అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో పాల్గొనే వారి కోసం రవాణా సదుపాయాన్ని కల్పిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, భీమిలి ఆర్డీవో సంగీత మాధూర్, పలువురు జిల్లా అధికారులు, నావికాదళ అధికారులు, బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు, యోగా అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య శాఖలో బదిలీలు షురూ

(5వ పేజీ తరువాయి)

కొత్తవారిని రానివ్వకుండాఎంతోమంది ఉద్యోగులు పాతుకుపోయారు. ఇటువంటి వారి వల్ల అనేకచోట్ల అవినీతికి ఆస్కారం ఏర్పడుతోంది. తాజా బదిలీల్లో ఇలాంటి వారంతా కొత్త ప్రాంతాలకు వెళ్లనున్నారు. దీనివల్ల అవినీతికి చెక్ పడుతుందని పలువురు పేర్కొంటున్నారు. తాజా బదిలీలతో ఆరోగ్యశాఖలోని కీలక సెక్షన్లు, కేజీహెచ్, ఇతర ప్రభుత్వాస్పత్రుల్లోని కొన్ని విభాగాల్లో అవినీతికి అడ్డుకట్ట పడుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఇవీ మార్గదర్శకాలు..

బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను చూస్తే ఒకేచోట ఐదేళ్లు దాటి పనిచేస్తున్న ఉద్యోగులందరినీ ట్రాన్స్‌ఫర్ చేయనున్నారు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల్లో ఆఫీస్ బేరర్లుగా ఉండి ఒకే ఇనిస్టిట్యూట్‌లో మూడు నుంచి తొమ్మిదేళ్లలోపు పనిచేస్తున్న వారిని తప్పనిసరిగా మరో ఇనిస్టిట్యూట్ (లోకల్)కు మార్చాల్సి ఉంటుంది. లోకల్‌గా లేకపోతే బయటకు వెళ్లాల్సి ఉంటుంది. తొమ్మిదేళ్లు దాటితే తప్పనిసరిగా బదిలీ కావాలి. ఆఫీస్ బేరర్స్ కాని ఉద్యోగులు మూడు నుంచి ఐదేళ్లలోపు ఒకే ఇనిస్టిట్యూట్‌లో పనిచేస్తుంటే తప్పనిసరిగా లోకల్‌గా ఉన్న మరో ఇనిస్టిట్యూట్‌కు బదిలీ కావాల్సి ఉంటుంది. లోకల్‌గా వేకెన్సీ లేకపోతే తప్పనిసరిగా మరో ప్రాంతానికి వెళ్లాల్సిందే. ప్రతి ఉద్యోగి బదిలీ కావాలనుకుంటే ఐదు ప్రాంతాలను ఆప్షన్‌గా ఎంచుకోవచ్చు. ఈ మేరకు ఆయా కేటగిరీలకు సంబంధించిన ఉద్యోగుల వివరాలను ఈ నెల మూడో తేదీలోగా కార్యాలయా ఆవరణలో డిస్‌ప్లే చేయాల్సి ఉంటుంది. ఉద్యోగులు తమ దరఖాస్తులను బదిలీ అధికారికి మూడో తేదీలోగా అందించాలి. అలాగే ఏమైనా మార్పులు, చేర్పులకు సంబంధించిన వివరాలను 4, 5 తేదీల్లోగా బదిలీలకు సంబంధించిన కంట్రోలింగ్ అధికారికి అందించవచ్చు. 6 నుంచి 8వ తేదీలోగా ఉన్నతాధికారులు ఆయా దరఖాస్తులను పరిశీలిస్తారు. 9న ఉద్యోగులు ఎంపిక చేసుకున్న స్థానాలతో కూడిన జాబితాను పొందుపరిచి గ్రీవెన్స్‌లను కోరుతారు. 10, 11 తేదీల్లో ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయవచ్చు. 12 నుంచి 14వ తేదీల మధ్య అభ్యంతరాలను నివృత్తి చేసి తుది జాబితాను అధికారులు పొందుపరుస్తారు. అదేవిధంగా 15 నుంచి 17వ తేదీల మధ్య బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తారు.


గాజువాక : సమావేశంలో మాట్లాడుతున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు


కూర్మన్నపాలెం : వడ్లపూడిలో రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్


ఆటోనగర్ : 71వ వార్డులో రేషన్ డిపోను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజాన రామారావు


సింధియా : రేషన్ డిపో వద్ద సరుకులు తీసుకుంటున్న కార్డుదారులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

» ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు » పలు చోట్ల రేషన్ డిపోల్లో సరుకుల పంపిణీ » సరుకుల కోసం పెద్ద సంఖ్యలో క్యూ కట్టిన కార్డుదారులు

గాజువాక, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పేదలకు పంపిణీ చేసే రేషన్ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిందని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 67వ వార్డులో రేషన్ డిపోను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్ పంపిణీ చేసే వ్యాను ఎప్పుడు వస్తుందో తెలియక చాలా మంది పనులు మానుకొని ఇంటి వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితులు ఇకపై ఉండవన్నారు. రోడ్డుపై వేచి ఉండాల్సిన పని లేదని, ఇకపై పదిహేను రోజుల పాటు ఉదయం, సాయంత్రం రెండు పూటలా రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. 65 ఏళ్ల దాటిన ఒంటరి వృద్ధులు, వికలాంగుల కోసం ఇంటి వద్దనే రేషన్ ఇచ్చే విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. పారదర్శకంగా రేషన్ పంపిణీ జరుగుతుందని, అవినీతికి ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. వ్యానులో రేషన్ పంపిణీ చేసే విధానం వలన కోట్లాది రూపాయలు దుర్వినియోగం అయ్యాయన్నారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, స్థానిక నాయకులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో..

ఆటోనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసర సరుకులను రేషన్ డిపోల ద్వారా అందించడం ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఇక్కట్లకు గురి కాకుండా చేయడమే కూటమి ప్రభుత్వ ఉద్దేశమని 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు అన్నారు. ఆదివారం 71వ వార్డు దిబ్బపాలెంలో రేషన్ డిపో ప్రారంభోత్సవంలో పాల్గొని కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పప్పు శంకరరావు, ప్రతాపరావు శ్రీనివాసరావు, ఎలుగుబంటి నర్సింగరావు,రాజారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే 70వ వార్డులోని డ్రైవర్సు కాలనీలో కూటమి నాయకులు నూతన రేషన్ డిపోను ప్రారంభించారు. ప్రతి నెలా 15 వరకూ నిర్దేశించిన సమయాల్లో డిపోలను సక్రమంగా తెరచి ప్రజలకు సేవలను అందించాలని డీలర్లకు సూచించారు. కార్యక్రమంలోచట్టి గోపి, కేవీఎస్ శంకరరావు, దేనంకొండ కృష్ణంరాజు, శ్రీకాంత్, శ్రీను, డీలర్ హరి తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ 86 వార్డు రాజీవ్ నగర్‌లో నూతన రేషన్ డిపో ప్రారంభోత్సవంలో కూటమి నాయకులు నల్లూరు సూర్యనారాయణ, కాద శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేద వాడికి రేషన్ సరుకులు ఎలాంటి ఇబ్బంది లేకుండా అందేలా కార్యక్రమంలో వేగుంట శ్రీనివాస్, గణపతి, నాగార్జున.సుబ్బయ్య, కె.రమేష్, జగదీష్, వేంకటేష్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెంలో..

కూర్మన్నపాలెం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పేదల రేషన్ కష్టాలకు నేటితో చెక్ పడిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి, కణితిలలో ఆదివారం ఉదయం రేషన్ డిపోల ద్వారా నిర్వహించిన సరుకుల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ దుకాణాల నిర్వహణ ఇబ్బందిగా తయారైందని విమర్శించారు. కార్యక్రమంలో కూటమి నేతలు రాజన్‌రాజు, సూరిశెట్టి పెంటారావు, డివి అప్పారావు, రాంబాబు, సిరసపల్లి కనకరాజు, లక్కరాజు సోంబాబు,రాము, దానయ్య, కృష్ణ, శ్రీను, ఆనంద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సింధియాలో..

సింధియా, జూన్ 01, (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 40, 62, 63, వార్డుల్లో రేషన్ డిపోల వద్ద లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరకులు పంపిణీ చేశారు. సాంకేతిక సమస్యలు తలెత్తినా గంటల తరబడి కూర్చోబెట్టకుండా ఫోటో తీసుకుని సరుకులు ఇచ్చేలా యంత్రం ఆదేవాలు ఇవ్వడం వల్ల లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీలలోపు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుండి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయని డిపో నిర్వాహకులు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులైన వారికి ప్రతినెలా 5వ తేదీలోగా సరకులు ఇళ్ల వద్దే అందిస్తామన్నారు.

62వ వార్డులో..

జీవీఎంసీ 62వ వార్డు పరిధి గుడివాడ అప్పన్న కాలనీలో ఎమ్మెల్యే పి.గణబాబు రేషన్ డిపోను పున ః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో రేషన్‌నుతీసుకునెందుకు రు చి వర ప్రజలు పడిగాపులు కాసేవారని, వాహనం ద్వార వచ్చే బియ్యం కొందమందికే దక్కేవని, తర్వాత ఆ వాహనం ఆ ప్రాంతానికి వచ్చేది కాదని, దీంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. ఇప్పుడు అలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లైయి అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే 63వ వార్డు పరిధి కాకరలోవ, చింతలలోవ గ్రామాలలో గల రేషన్ డిపోలను వార్డు కార్పొరేటర్ గల్లా పోలిపిల్లి (చిన్నా) పునఃప్రారంభించారు.

అక్కిరెడ్డిపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 68, 69 వార్డుల్లోని మింది, వెంకటేశ్వరకాలనీ, అక్కిరెడ్డిపాలెం, తుంగ్లాంతో పాటు పలు రేషన్ దుకాణాల వద్ద కార్డుదారులకు నిత్యావసర సరుకుల పంపిణీ ప్రారంభమైంది. పలు రేషన్ దుకాణాల్లో బయో మెట్రిక్ మిషన్‌లు కొద్దిసేపు మొరాయించినప్పటికి తరువాత చక్కగా పని చేయడంతో కార్డు దారులు ఆనందంగా సరుకులు తీసుకు వెళ్లారు. మిందిలో సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంత లక్ష్మి ప్రారంభించగా.. ఈటి శ్రీను, డొప్ప అప్పలరాజు, జి.తాతారావు తదితరులు పాల్గొన్నారు. వెంకటేశ్వరకాలనీలో 69వ వార్డు కూటమి నాయకులు కరణం ముత్యాలనాయుడు ప్రారంభించారు.

అగనంపూడిలో..

అగనంపూడి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79, 85 వార్డుల పరిధి అగనంపూడి ఉక్కు నిర్వాసిత కాలనీలు, పరిసర ప్రాంత గ్రామాల్లో ఆదివారం రేషన్ డిపోలు ప్రారంభాన్ని వేడుకగా నిర్వహించారు. నాలుగేళ్ల పాటు మూత బడిన డిపోలకు నూతన శోభ సంతరించుకుంది. డీలర్ల మామిడి తోరణాలు, పూలదండలతో డిపోలను అలంకరించారు. 79వ వార్డులో గల ప్రశాంతినగర్, గల్లావానిపాలెం ప్రాంతాల్లో రేషన్ డిపోలను వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ కూటమి నేతలతో కలిసి ప్రారంభించారు. డీలర్ల సమయ పాలన పాటించి సరుకులను అందజేయాలని సూచించారు. అలాగే 85వ వార్డు పరిధిలో గల ఫార్మాసిటీ పునరావాస కాలనీ, పినమడక, దిబ్బపాలెం, కొండయ్యవలస, దానబోయిన పాలెం ప్రాంతాల్లో డిపోలను 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి కూటమి నేతలతో కలిసి ప్రారంభించారు.


ఈత కొలనులో జల యోగాసనం వేసిన డాక్టర్ యార్లగడ్డ గీతా శ్రీకాంతి

విశాఖ మహిళ జల యోగాసనాలు

» 30 రకాల ఆసనాలు వేసిన డాక్టర్ యార్లగడ్డ గీతా శ్రీకాంత్

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంఘ సేవకురాలు, పారిశ్రామికవేత్త డాక్టర్ యార్లగడ్డ గీతా శ్రీకాంత్ జల యోగాలో భాగంగా వివిధ యోగాసనాలు వేసి అబ్బురపరిచారు. ఆదివారం విశాఖలోని స్పోర్ట్స్ ఎరీనాలో ఆర్ట్ లివింగ్, విశాఖ డిస్ట్రిక్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ ఆయుష్ డిపార్ట్‌మెంట్ సంయుక్త సహకారంతో గంటపాటు జలయోగ ప్రదర్శన చేశారు. మొత్తం 30 రకాల ఆసనాలు వేసి సందర్శకులను అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ జల యోగా వల్ల శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. హిమాలయ యోగి ప్రభాకర్ గురూజీ.. జల యోగా ఉపయోగాలు, ప్లావని ప్రాణాయామం గురించి వివరించారు. అనంతరం గీతా శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ కృషితో యోగాను ప్రపంచ దినోత్సవంగా ప్రకటించిన తరువాత జల యోగాపై దృష్టి సారించానన్నారు.

ఉపాధ్యాయుల బదిలీల్లో వీడని గందరగోళం

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):

ఉపాధ్యాయుల బదిలీల్లో గందరగోళం కొనసాగుతోంది. కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించాలన్న ప్రభుత్వ నిర్ణయమే దీనికి కారణమన్న వాదన ఉపాధ్యాయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించడాన్ని ఎస్‌జీటీలు వ్యతిరేకిస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలకు పని భారం ఎక్కువగా ఉంటుంది. ఇప్పటివరకు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు బోధన చేసిన స్కూల్ అసిస్టెంట్లు, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంగా వెళితే మూడు నుంచి ఐదు తరగతులకు బోధన చేయడం ఏమిటన్న వాదన వారిలో ఉంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో సర్దుబాటుతో మిగిలిన స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా నియమిస్తున్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో హెచ్‌ఎంలుగా వెళ్లేందుకు పలువురు స్కూల్ అసిస్టెంట్లు సమ్మతించినా.. ఏజెన్సీలో మారుమూల ప్రాంతాలకు వెళ్లడానికి విముఖత చూపుతున్నారు. ఆదివారం సాయంత్రంతో ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎంలుగా వెళ్లడానికి స్కూల్ అసిస్టెంట్లకు ఇచ్చిన గడువు ముగిసింది. మొత్తం 563 పాఠశాలల్లో ఇంకా 26 పాఠశాలలకు ఎవరూ ఆప్షన్ ఇవ్వలేదు. దీంతో మిగులుగా ఉన్న 86 మంది స్కూల్ అసిస్టెంట్లలో 26 మందిని ఏజెన్సీకి పంపనున్నారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించి వారిని ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా పంపితే మంచిదని ఎస్‌టీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు అభిప్రాయపడ్డారు.

ఫిలిప్పీన్స్ సదస్సుకు ఈపీడీసీఎల్ సీఎండీ

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు జరగనున్న ఆసియా క్లీన్ ఎనర్జీ ఫోరమ్ (ఏసీఈఎఫ్)- 2025 సదస్సుకు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ వెళుతున్నారు. ఈ పర్యటనకు అయ్యే మొత్తం వ్యయాన్ని ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ భరిస్తుంది. క్లీన్ ఎనర్జీపై ఏపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న నేపథ్యంలో అక్కడ చర్చకు వచ్చే అంశాలను రాష్ట్రంలో ఏ విధంగా ఉపయోగించుకోవచ్చో సూచిస్తూ పర్యటన తరువాత నివేదిక సమర్పించాలని ఆయనకు ప్రభుత్వం సూచించింది.

నేడు ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్ ఓపెన్ ఆడిటోరియం పునఃప్రారంభం


ప్రారంభానికి సిద్ధమైన రాజీవ్ ఇండోర్ స్టేడియం

పెదగంట్యాడ, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 65వ వార్డు పరిధి వికాస్ నగర్‌లో రూ.11 కోట్లతో ఆధునీకరించిన రాజీవ్ ఇండోర్ స్టేడియం, ఓపెన్ ఆడిటోరియం, నూతనంగా నిర్మించిన స్విమ్మింగ్ పూల్‌ను సోమవారం ప్రారంభించనున్నారు. 16 ఏళ్ల క్రితం జీవీఎంసీ నిర్మించిన ఇండోర్ స్టేడియం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ప్రస్తుత కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు జీవీఎంసీ పాలకవర్గం, అధికారులను సంప్రదించి వీటి ఆధునీకరణకు కృషిచేశారు. ఇండోర్ స్టేడియం పక్కనే ఉన్న విశాల స్థలంలో స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటుకు అధికారులు అంగీకరించారు. ఏడాదిన్నర క్రితం ఆధునీకరణ పనులు ప్రారంభమయ్యాయి. ఆ పనులు పూర్తవ్వడంతో సోమవారం సాయంత్రం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాసరావులు ప్రారంభించనున్నారు. ఆదివారం కార్పొరేటర్ నరసింహపాత్రుడు, జీవీఎంసీ అధికారులు ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. మంగళవారం నుంచి ఇవి క్రీడాకారులకు అందుబాటులో రానున్నాయి.

టి20 క్రికెట్‌మ్యాచ్ విజేత సీవోఎస్ 11 జట్టు

విశాఖపట్నం, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : తూర్పునావికాదళం చీఫ్ ఆఫ్ స్టాఫ్ (సీఓఎస్11), ఇండియన్ రైల్వే వాల్తేరు డివిజన్ (డీఆర్ఎం11) జట్ల మధ్య శనివారం రాత్రి రైల్వే క్రికెట్ గ్రౌండ్‌లో టీ 20 మ్యాచ్ జరిగింది. రెండు జట్లు హోరాహోరీగా ఆడాయి. చివరకు తూర్పునావికాదళం చీఫ్‌ఆఫ్ స్టాఫ్ జట్టు విజేతగా నిలిచింది. తూర్పునావికాదళం వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ విజేతజట్టుకు, రన్నర్ జట్టుకు ట్రోఫీలు అందజేశారు.

సినిమా గైడ్

- **భైరవం** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కరాటే కిడ్** : శారద
- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), లలిత (శ్రీహరిపురం)
- **ఫైనల్ డెస్టినేషన్** : రమాదేవి,
- **సింగిల్** : మెలోడి, కామేశ్వరి, గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 15, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 22, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 15, క్యారెట్ 38 దొండకాయలు 20, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది)54, బరబాటి 36, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోస కాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 34, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	95
లైవ్ ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

సందడిగా రేషన్ దుకాణాలు పునఃప్రారంభం


పాపయ్యరాజుపాలెం వద్ద బియ్యం అందజేస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు


గోపాలపట్నంలోని ఓ డిపోలో సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు, చిత్రంలో కూటమి నాయకులు

పెందుర్తి రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రేటర్ 95వ వార్డు పరిధి, గ్రామీణ ప్రాంతాల్లోని రేషన్ డిపోలను ఆదివారం పునఃప్రారంభించారు. పాపయ్యరాజుపాలెం డిపోను స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ప్రారంభించి కార్డుదారులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు దాట్ల మధు, నాయకులు రోమాల శ్రీను, సన్ని పాల్గొన్నారు. సుజాతనగర్, పురుషోత్తపురం, చీమలాపల్లి, లక్ష్మీపురం, గవరపాలెం కాలనీ, పొర్లుపాలెం, చింతల అగ్రహారం, పెదగాడి, పినగాడి గ్రామాల్లో ఉదయం 8 గంటలకే డిపోలను ప్రారంభించారు.

ప్రజలకు మెరుగైన సేవలు: గణబాబు

మల్కాపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం శివారు అల్లూరి సీతారామరాజు కాలనీకి చెందిన రేషన్ డిపోను పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆదివారం ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. తొందరలోనే మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేసే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 61, 62 వార్డుల టీడీపీ అధ్యక్షులు మజ్జి సోమేష్, మజ్జి మాలినాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు. యారాడలో రేషన్ డిపోను 64వ వార్డు టీడీపీ ఉపాధ్యక్షుడు తొత్తరి శ్రీనివాసరావు (చిట్టి) ప్రారంభించారు. ప్రజలకు ప్రభుత్వం చేరువగా ఉంటుందని తెలిపారు. ప్రజలకు మేలు చేయడమే ధ్యేయమని తెలిపారు.

పండుగ వాతావరణం

గోపాలపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): చౌక ధరల దుకాణాల ద్వారా కార్డుదారులకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో ఆదివారం జరిగింది. గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని డిపోల్లో ఈ కార్యక్రమాన్ని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ప్రారంభించారు. రేషన్ బియ్యం అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేసేందుకు చౌకధరల దుకాణాల ద్వారా సరుకుల పంపిణీని ప్రభుత్వం పునఃప్రారంభించినట్లు తెలిపారు. తొలిరోజు డీలర్లు దుకాణాలను పూలతో అలంకరించారు. గోపాలపట్నం తహసీల్దార్ సీహెచ్‌వీ రమేశ్ పాల్గొన్నారు. సర్వర్ మొరాయింపుతో కాస్త ఇబ్బంది: రేషన్ డిపోల పునఃప్రారంభం తొలిరోజున సర్వర్ మొరాయించడంతో పంపిణీలో కాస్త ఆలస్యం జరిగింది. పలు రేషన్ డిపోల వద్ద టెంట్‌లు ఏర్పాటు చేయడంతో ఎండ నుంచి ఇబ్బంది తప్పింది.

అనుకూల సమయంలో సరుకులు

వేపగుంట: రాష్ట్రంలోని ప్రజలంతా తమ అనుకూల సమయంలో రేషన్ సరుకులు పొందేందుకే గతంలో ఉన్న రేషన్ డిపోలను ప్రారంభించినట్లు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పేర్కొన్నారు. శ్రీనివాసనగర్‌లో ప్రజలకు సరుకులు పంపిణీ చేశారు. ప్రజాశ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని తిరిగి రేషన్ డిపోలను ప్రారంభించామన్నారు. కార్పొరేటర్ రాపర్తికన్నా, వరహాలు, ఆదిబాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్ : జీవీఎంసీ 90వ వార్డు పరిధిలో రేషన్ దుకాణాలను కార్పొరేటర్ బొమ్మిడి రమణ ప్రారంభించారు. మొదటగా లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో ఉన్న రేషన్ డిపోను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గవరవీధిలో ఉన్న రేషన్ దుకాణం ప్రారంభించి సరుకులు పంపిణీ చేశారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు శరగడం అరుణ్‌కుమార్, సంతోష్, పట్నాయక్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్: మేయర్ 'పీలా'


పెందుర్తిలో వృద్ధురాలికి రేషన్ అందజేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

పెందుర్తి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు. దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందజేయనున్నట్లు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు వెల్లడించారు. 96వ వార్డు పరిధి పెందుర్తిలోని రేషన్ డిపోను ఆదివారం ప్రారంభించిన మేయర్ పీలా నిత్యావసర సరుకులను కార్డుదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంతోషమ్మ అనే వృద్ధురాలి ఇంటికి మేయర్ వెళ్లి ఆమెకు స్వయంగా రేషన్ సరుకులను అందజేశారు, రేషన్ డిపోలో తూనికలు, బియ్యం నాణ్యతను పరిశీలించారు. ఈ పోస్ వేలిముద్ర కోసం సర్వర్ మొరాయించడంతో ఈ విషయాన్ని మేయర్ పీలా జేసీ అశోక్‌కుమార్‌కి ఫోన్ చేసి సమాచారాన్ని తెలియపరచి సమస్యను పరిష్కరించారు. అనంతరం పీలా మాట్లాడుతూ గత ప్రభుత్వం రేషన్ పేరిట బియ్యం అక్రమ రవాణా చేసి దోపిడీకి పాల్పడిందన్నారు. కూటమి సర్కార్ పారదర్శకంగా రేషన్ పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పెంటకోట రాజేంద్రప్రసాద్, పీలా జితేంద్ర, అప్పారావు, రమేశ్, సత్యం పాల్గొన్నారు.

రేషన్ సరుకులు అందజేసిన కూటమి నేతలు

నూతన రేషన్ విధానం పెందుర్తి మండలంలో కూటమి నేతలు అట్టహాసంగా ప్రారంభించారు. చౌక దుకాణాలను తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాంపురంలో మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, గొరపల్లిలో మండల టీడీపీ అధ్యక్షుడు కరక దేవుడు, చింతగట్లలో టీడీపీ నేత గనిశెట్టి కనకరాజు, నరవలో జనసేన నేత గల్లా శ్రీనివాసరావు, పులగాలిపాలెంలో టీడీపీ సీనియర్ నేత అవగడ్డ అప్పలనాయుడు చౌక దుకాణాలను ప్రారంభించారు. సర్వర్ మొరాయించడంతో నెమ్మదించిన సాంకేతిక సమస్యను అధికారులు సరిదిద్దడంతో నిత్యావసర సరుకుల పంపిణీ సాఫీగా జరిగింది.

ఆర్పీపేట: పేదలందరికీ రేషన్ సరుకులు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. రేషన్ దుకాణాన్ని 56వ వార్డులో ఆయన ప్రారంభించి కార్డుదారులకు సరుకులు అందజేశారు. గత ప్రభుత్వం ఎండీయూ వాహనాల పేరిట ప్రజాధనాన్ని దుబారా చేసిందన్నారు. నెలలో 15 రోజులు దుకాణాల వద్ద సరుకులు తీసుకోవచ్చన్నారు. కార్పొరేటర్ రాజశేఖర్, జనసేన నాయకురాలు అంగ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ స్థాయిలో నేటి నుంచి యోగా పోటీలు

డాబాగార్డెన్స్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): యోగా పోటీల్లో పాల్గొన్నవారంతా సచివాలయ స్థాయిలో నిలిచిన వారికి సోమవారం నుంచి ఈ నెల 7 వరకు మూడు కేటగిరీల్లో మండలస్థాయిలో పోటీల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసినట్లు సమగ్రశిక్షా అదనపు పథక సమన్వయకర్త జె.చంద్రశేఖరరావు తెలిపారు. ఎంపీడీవో చైర్మన్‌గా, ఎంఈవో-2, వివిధ స్థాయి అధికారులు, యోగా గురువులు ఈ పోటీలు నిర్వహిస్తారన్నారు. సచివాలయ స్థాయిలో మొదటిస్థానంలో విజేతలుగా ఎంపికైన వారు ఆధార్ కార్డుతో పాల్గొనాలని సూచించారు. ఆనందపురం జెడ్పీహెచ్ఎస్, భీమునిపట్నం ఎంపీడీఓ ఆఫీస్, చినగదిలి జెడ్పీహెచ్ఎస్ తోటగరువు, గాజువాక జెడ్పీహెచ్ గోపాలపట్నం, మహారాణిపేట సెంట్రల్ పార్కు, ములగాడ జీవీఎంసీహెచ్ఎస్ మల్కాపురం, పద్మనాభం వెలుగు ఆఫీస్, పెదగంట్యాడ జెడ్పీహెచ్ఎస్ నడపూర్, పెందుర్తి జీహెచ్ఎస్ పెందుర్తి, సీతమ్మధార హిల్‌వ్యూ పార్కు కేంద్రాల్లో పాల్గొనాలన్నారు.

ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలుగా రాధాకుమారి, శాంతికుమారి

అక్కయ్యపాలెం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల నూతన ప్రధానోపాధ్యాయురాలిగా భీమిలి నుంచి వచ్చిన జయంతి రాధాకుమారి, గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీలోని కేఎస్ఎం పాఠశాల హెచ్‌ఎంగా మధురానగర్ నుంచి వచ్చిన శాంతికుమారి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ రెండు ఉన్నత పాఠశాలల్లో ఇంతవరకు పనిచేసిన బి.లక్ష్మీనరస మధురానగర్‌కు, రాము సీతమ్మధారకు బదిలీ అయ్యారు. రాధాకుమారికి ఎన్‌సీసీ ముఖ్య అధికారి ఎంఎన్‌వీ విశ్వనాథం ఆధ్వర్యంలో క్యాడెట్లు స్వాగతం పలికారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్ వంగల అప్పలరాజు, వైస్ చైర్ పర్సన్ బి.ఉషారాణి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్షలు

సీతంపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలో నిర్వహించిన కానిస్టేబుల్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలోని సీతంపేట రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాల, వి.టి. కళాశాలలో పోటీ పరీక్షలకు వచ్చిన అభ్యర్థులకు ఎస్ఐ ధర్మేంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేసి పరీక్ష కేంద్రం లోపలకు పంపించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

వైసీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ పిలుపు


ప్రసంగిస్తున్న మళ్ల విజయప్రసాద్

మల్కాపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో విఫలమైన కూటమి ప్రభుత్వ తీరును వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ పిలుపునిచ్చారు. శ్రీహరిపురం వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సాయంత్రం 40, 58 నుంచి 63 వార్డుల వైసీపీ కార్పొరేటర్లు, అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. అరెస్టులతో కొనసాగుతున్న కూటమి పాలనను ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. మహానాడులో చెప్పేది ఏమీలేక మాజీ సీఎం జగన్మోహనరెడ్డిని తిడుతూ, వారిలో వారు పొగుడుకున్నారని అన్నారు. మంత్రి లోకేశ్ పదోతరగతి పరీక్షల మూల్యాంకనం చేయించడంలో విఫలమయ్యారని, తొలిసారిగా పెద్దఎత్తున విద్యార్థులు వాల్యూషన్‌కు దరఖాస్తు చేసుకోవలసి రావడం దారుణమని వ్యాఖ్యానించారు కార్పొరేటర్లు పీవీ సురేష్, గుండపు నాగేశ్వరరావు, బల్ల లక్ష్మణరావు, మాజీ కార్పొరేటర్ గల్లా శ్రీను పాల్గొన్నారు.

కరాటే పోటీలు ప్రారంభం


పోటీలో తలపడుతున్న ప్రత్యర్థులు

మల్కాపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 59వ వార్డు మాజీ సైనికుల కాలనీలో గల అంబేడ్కర్ మైదానంలో వాడోకో కరాటే అసోసియేషన్ ఆదివారం కరాటే పోటీలు ప్రారంభించింది. పోటీలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కరాటే శిక్షణ పొందడం వల్ల సంపూర్ణమైన ఆరోగ్యవంతులుగా ఉండవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే నిర్వాహకుడు జి.శ్రీనివాసరావు (భరత్), కూటమి నాయకులు పుర్రె సురేష్‌యాదవ్, ముజ్జడ చంద్రమౌళి, పొలిమేర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రేషన్ దుకాణాలు ప్రారంభం

»ప్రతినెలా 15 రోజులు సరకుల పంపిణీ »కూటమి నాయకుల సందడి »తొలిరోజు మొరాయించిన సర్వర్లు » కార్డుదారుల నిరీక్షణ


రేషన్ సరకుల పంపిణీ ప్రారంభిస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, కూటమి నాయకులు


సీతమ్మధారలో రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ తదితరులు

మహారాణిపేట/సీతమ్మధార/కంచరపాలెం/మురళీనగర్/అక్కయ్యపాలెం/ అల్లిపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ, ఉత్తర నియోజకవర్గాల్లో కూటమి పార్టీ నేతల ఆధ్వర్యంలో రేషన్ డిపోల ద్వారా సరుకుల పంపిణీని ఆదివారం అట్టహాసంగా ప్రారంభించారు. ప్రజలు వీలైనప్పుడు వచ్చి సరుకులు తీసుకునే వెసులుబాటు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డిపోలను పునఃప్రారంభించింది. దక్షిణ నియోజకవర్గంలో శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, జనసేన నాయకుడు శివప్రసాద్ రెడ్డి, కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, గోడి విజయలక్ష్మి నరసింహాచారి తదితరుల ఆధ్వర్యంలో 29, 30, 35, 37, 38 వార్డులతో పాటు పూర్ణామార్కెట్, కోటవీధి, వెలంపేట, మహారాణిపేట తదితర ప్రాంతాల్లో కూటమి నాయకులు డిపోల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రేషన్ షాపులను నిస్తేజంగా మార్చడంతో కూటమి ప్రభుత్వం వాటికి పునర్జీవం కల్పించిందని, ప్రతీ నెల 1 నుంచి 15వ తేదీ వరకు తెరిచి ఉంచుతారన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య, మళ్లీ సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజలు ఎప్పుడు వీలైతే అప్పుడు వచ్చి సరుకులు తీసుకోవచ్చన్నారు. చాలాకాలం తరువాత రేషన్ షాపులలో తిరిగి మిషన్లు రావటం, ఒక్కసారిగా దాదాపు 30 వేల మిషన్లు ప్రారంభించటంతో సర్వర్లు మొరాయించాయి. దీనితో సరుకులు తీసుకోవటానికి వచ్చినవారు ఇబ్బందులకు గురయ్యారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు. ఏ రేషన్ డిపో వద్దనైనా రేషన్ తీసుకునే విధానాన్ని తీసుకురావడంతో అందరు ఎక్కడున్నా ఆయా ప్రాంతాల్లో రేషన్ తీసుకోవచ్చని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ 24వ వార్డులో రేషన్ డిపోను రిబ్బన్ కట్ చేసి వారు ప్రారంభించారు. సాంకేతిక మార్పులతో పాటు సరకులు పంపిణీని సౌకర్యవంతంగా చేయడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ సాడి పద్మరెడ్డి, కూటమి నాయకులుపాల్గొన్నారు. 47వవార్డులో కప్పరాడ రేషన్ దుకాణం ద్వారా లబ్దిదారులకు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సరకులను అందజేశారు. దుబారా ఖర్చులు నివారించడానికి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను రద్దు చేసిందన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు సరకులను ఇళ్లవద్దకే అందించనున్నట్టు తెలిపారు. కార్పొరేటర్ కామేశ్వరి, కూటమి నాయకులు పసుపులేటి ఉషాకిరణ్, నజీర్, ఈతలపాక సుజాత, ఆర్.రాంబాబు, అరుణ్, అరుణ పాల్గొన్నారు. 48వవార్డులో టీడీపీ నాయకుడు గొర్లె అప్పారావు, 55వ వార్డులో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఈతలపాక సుజాత, 54వ వార్డులో ఉత్తర జనసేన నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్ పేదలకు సరకులను అందజేశారు. పేదలకు రేషన్‌ను పారదర్శకంగా అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వాహనాలను నిలిపివేందని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా డిపోల ద్వారా సరకులు అందిస్తామని కార్పొరేటర్లు బీశెట్టి వసంతలక్ష్మి, కందుల నాగరాజు అన్నారు. 32, 33 వార్డులలో రేషన్ దుకాణాలను ప్రారంభించారు. 14వ వార్డులో రేషన్ దుకాణాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరుశురామ్ రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సరికొత్త నిర్ణయంతో ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15 తేదీ వరకు రేషన్ షాపుల ద్వారా నిత్యవసర సరకుల పంపిణీ జరుగుతుందన్నారు. అక్కయ్యపాలెం పరిధిలోని గ్రేటర్ 26, 27, 42, 43, 44, 45, 46 వార్డుల్లోని రేషన్ డిపోలు పునఃప్రారంభమయ్యాయి. మాధవధారలో 53వ డిపో డీలర్ భాస్కరరావు చేపట్టిన సరఫరాలో టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, బీజేపీ, జనసేన ప్రతినిధులు పాల్గొన్నారు. బర్మాక్యాంప్, ఎన్‌జీజీఓస్ కాలనీ ప్రాంతాల్లో రేషన్ పంపిణీ చేశారు.


14వ వార్డులో రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ అధ్యక్షుడు పరశురామరాజు

ప్రశాంతంగా కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కానిస్టేబుళ్ల నియామకాలకు సంబంధించిన మెయిన్స్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని 27 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 12,491 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 11,338 (90.76 శాతం) మంది హాజరయ్యారు. ఆయా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 8 గంటలు నుంచే అభ్యర్థులు బారులుతీరారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరిగింది. జిల్లాలోని పరీక్ష కేంద్రాలకు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే లోపలకు అనుమతించారు. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల ఉన్న జిరాక్స్ సెంటర్లను పోలీస్ అధికారులు మూసివేయించారు. కాగా పలు కేంద్రాలను నగర ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, డీసీపీలు అజిత వేజెండ్ల, డి.మేరీప్రశాంతి, శ్రీకృష్ణకాంత్‌లు పరిశీలించారు.

రేషన్ డిపోల్లో సందడి

(5వ పేజీ తరువాయి)
మందికి పంచదార పంపిణీ చేశారు. కాగా కొన్నిచోట్ల మాత్రమే కందిపప్పును పంపిణీ చేయడం జరిగింది.

సర్వర్ మొరాయింపు

ఆదివారం ఉదయం నుంచి జిల్లాలోని 642 డిపోల్లో ఒకేసారి సరకుల పంపిణీ ప్రారంభమైంది. ఇంకా రాష్ట్రంలో వేల డిపోల్లో సరకుల పంపిణీకి డీలర్లు ప్రయత్నించడంతో సర్వర్ మొరాయించింది. నెట్‌వర్క్ ఎర్రర్ అని, మరోసారి ప్రయత్నించండి అంటూ ఈ పోస్ మిషన్‌పై చూపించడంతో కార్డుదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో గంటకు పదికి మించి కార్డుదారులకు సరకులు ఇవ్వడానికి డీలర్లు ప్రయత్నించాల్సి వచ్చింది. ఎండ తీవ్రతతో కార్డుదారులు అసౌకర్యానికి గురయ్యారు. ఆదివారం సెలవు రోజు కావడంతో సర్వర్ సమస్యను పరిష్కరించడానికి వీలుకావడం లేదని అధికారులు వివరించారు. ఒకేసారి వేలమంది డీలర్లు లాగిన్ కావడంతో సమస్య ఉత్పన్నమైందని, రెండు మూడు రోజులలో అంతా సర్దుకుంటుందన్నారు.

రేషన్ కోసం నిరీక్షణ

అక్కయ్యపాలెం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీలోని పలు రేషన్ డిపోల్లో ఉదయం 8 గంటలకు ప్రారంభమవ్వాల్సిన రేషన్ సరుకుల పంపిణీ ఆలస్యమైంది. డిపోలను ప్రారంభించాల్సిన నాయకులు రాకపోవడంతో కార్డుదారులు డిపోల వద్దే చాలా సేపు పడిగాపులు కాశారు. మొదటి రోజు కావడంతో సర్వర్ కూడా కొద్దిసేపు మొరాయించింది. 9-30 గంటలైనా రేషన్ సరుకుల పంపిణీ అవ్వకపోవడంతో కార్డుదారులు నిరుత్సాహంతో అసహనం వ్యక్తం చేశారు. తాము వివిధ ప్రాంతాల నుంచి రేషన్ సరుకుల కోసం వస్తే ఇక్కడ ఇవ్వకుండా నాయకుల కోసం వేచి ఉండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఎండీయూ రేషన్ వాహనాల వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని, మరల ప్రస్తుతం కూడా ఇలా వేచి ఉండడం సరైన పద్ధతి కాదంటున్నారు. ఇకపై ఇలా ఆలస్యం చేయకుండా సకాలంలో రేషన్ సరుకులు అందించేలా తగు చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.


రైల్వేన్యూకాలనీలోని 39వ డిపో వద్ద వేచి ఉన్న కార్డుదారులు

'ఆంధ్రజ్యోతి' చొరవతో సమస్యలకు మోక్షం

(5వ పేజీ తరువాయి)
ఏపీఐఐసీ, విద్యుత్ శాఖాధికారులు హాజరయ్యారు. అక్కడి ప్రజలు చెప్పినవన్నీ విన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో అధికారులు వాటికి పరిష్కారం చూపించారు. డంపింగ్ యార్డుగా మారిన ఏపీఐఐసీ ఖాళీ స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. అక్కడ ఉన్న చెత్తను తరలిస్తున్నారు. అలాగే కాలనీలోకి వస్తున్న మురుగు నీటిని మళ్లించేందుకు డైవర్షన్ కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టారు. గెడ్డల్లో మురుగునీరు నిల్వ లేకుండా 15 రోజులకు ఒకసారి శుభ్రం చేస్తున్నారు. లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను వేశారు. అదేవిధంగా వడ్లపూడిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలాన్ని తహసీల్దార్, సిబ్బంది పరిశీలించి బోర్డులు పెట్టారు. ఆ స్థలంలో లైబ్రరీ, వృద్ధాశ్రమం నిర్మించే ఆలోచనలో ఎమ్మెల్యే ఉన్నారు. స్థానిక యువతకు క్రీడా సదుపాయం కోసం ఖాళీగా ఉన్న 4.5 ఎకరాల జీవీఎంసీ స్థలంలో రూ1.15 కోట్లతో ప్రహరీ నిర్మాణానికి హామీ ఇచ్చారు. కాలనీవాసులకు అందుబాటులో ఉండేలా ఆర్టీసీ అధికారులు బస్సును నడపబోతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం తిరుమలనగర్‌లోని ఆర్యవైశ్య సామాజిక భవన్‌లో 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో సభ జరగనున్నది. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య, కార్పొరేటర్ బొండా జగన్, జీవీఎంసీ జోనల్ కమిషనర్, ఐలా కమిషనర్, ఇతర శాఖల అధికారులు పాల్గొంటున్నారు. ముందుగా ఉదయం 9.30 గంటలకు కణితి మీ-సేవా కేంద్రం వద్ద ఆర్టీసీ బస్సును జెండా ఊపి ప్రారంభిస్తారు. అనంతరం అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. పది గంటలకు సభలో పాల్గొని స్థానికులతో ముచ్చటిస్తారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

(5వ పేజీ తరువాయి)
పెందుర్తిలో ఉంటున్న మద్దాల శ్రీరామ్ (17) స్నేహితులు. శ్రీరామ్ ఇటీవల ఇంటర్ పూర్తి చేసి ఇంజనీరింగ్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నాడు. వీరిద్దరూ కలిసి ఆదివారం సాయంత్రం ఫొటో షూట్ కోసం వేరే స్నేహితుడి నుంచి బైకు తీసుకుని బయలుదేరారు. ఎన్‌హెచ్-16 రోడ్డు సరిపల్లి ఆర్వోబీ మీదుగా అవినాశ్ బైకును నడుపుతుండగా ఒక్కసారిగా కుక్క అడ్డు రావడంతో వాహనాన్ని అదుపు చేయలేక సమీపంలో గల డివైడర్‌ను బలంగా ఢీకొన్నాడు. దీంతో వాహనం నుజ్జవ్వడంతో పాటు వారిద్దరూ రోడ్డుపై ఎగిరిపడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాపాయం తప్పేదని స్థానికులు పేర్కొంటున్నారు. సమాచారం అందుకున్న వెంటనే సీఐ సతీశ్‌కుమార్, ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో ఇరువురి మధ్య ఘర్షణ

» మేడపై నుంచి నెట్టేయడంతో చికిత్స పొందుతూ యువకుడు మృతి

» నిందితుడిపై హత్య కేసు నమోదు

మహారాణిపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి ఉన్న వ్యక్తి మేడపై నుంచి ఓ యువకుడిని నెట్టేయడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లోతేటి హేమంత్ (24) అనే యువకుడు చంగలరావుపేట ఏవీఎన్ కళాశాల సమీపంలో నివాసం ఉంటూ దొంగతనాలకు పాల్పడేవాడు. సమీపంలోని కాకర వీధిలో దోని సతీష్ (29) అనే రౌడీషీటర్ ఉంటున్నాడు. ఇద్దరి మధ్య కొంత కాలంగా విభేదాలున్నాయి. ఇటీవల సతీష్ ఇంట్లో హేమంత్ దొంగతనానికి పాల్పడటంతో ఇద్దరూ గొడవ పడ్డారు. ఈ క్రమంలో మే 29న రాత్రి 9 గంటల సమయంలో హేమంత్ మరో స్నేహితుడు పవన్‌తో కలసి ఏవీఎన్ కళాశాల సమీపంలోని సచివాలయ భవనంపై మద్యం తాగుతున్నారు. ఈ క్రమంలో పవన్ ఏదో కొనుగోలు చేసేందుకు బయటకు వెళ్లిన సమయంలో హేమంత్ వద్దకు సతీష్ వచ్చాడు. ఇద్దరి మధ్య ఘర్షణ జరగ్గా, హేమంత్‌ను సతీష్ తోసేయటంతో ఒకటో అంతస్తు నుంచి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయమై రక్తస్రావం జరిగింది. అదే సమయంలో అక్కడకు చేరుకున్న పవన్ వెంటనే హేమంత్‌ను కేజీహెచ్‌కు తరలించాడు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి హేమంత్ మృతి చెందాడు, పోలీసులు నిందితుడు సతీష్‌ను అదుపులోకి తీసుకోగా నేరం అంగీకరించటంతో అతనిపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి

ఆనందపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పందలపాక గ్రామంలో విద్యుదాఘాతంతో బాలిక మృతి చెందింది. సీఐ చింతా వాసునాయుడు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన గండిమాని రంగా కల్లుగీత కార్మికుడు. ఆయన కుమార్తె సాయి మేఘన (12) ఆనందపురంలోని ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. ఆదివారం ఉదయం ఇంట్లోని మోటారు వేయడానికి వెళ్లగా షార్ట్ సర్క్యూట్ వల్ల షాక్‌కు గురైంది. వెంటనే తల్లిదండ్రులు ఆమెను తగరపువలసలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఉన్న ఒక్కగానొక్క కుమార్తె విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

మద్యం మత్తులో స్పృహ కోల్పోయి డ్రైవర్ మృతి

లంకెలపాలెం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పూటుగా మద్యం సేవించి ఓ డ్రైవర్ మృతిచెందిన సంఘటన లంకెలపాలెం ఫ్లైఓవర్ వద్ద చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలివి. విశాఖపట్నానికి చెందిన జి.ధనపాల్ బాలాజీ (55) ఫార్మాసిటీలో ఓ వాహనానికి ఆఫ్టింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం పూటుగా మద్యం సేవించి ఇక్కడున్న బ్రిడ్జి వద్ద స్పృహ కోల్పోయి పడిపోయాడు. ఎంతటికీ తెలివి రాకపోవడంతో స్థానికులు పరవాడ పోలీసులు సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా, అప్పటికే మృతిచెందిన ఉన్నట్టు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిని పూర్తి వివరాలకు తెలియాల్సి ఉందనిసీఐ మల్లికార్జునరావు తెలిపారు.

'మహారాజా బ్యాంకు సేవలు మరింత విస్తరించాలి'

డాబాగార్డెన్స్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్న ది మహారాజా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ భవిష్యత్‌లో మరింతగా సేవలను విస్తరింపజేయాలని కేంద్ర మాజీమంత్రి అశోక్ గజపతిరాజు ఆకాంక్షించారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో జరిగిన బ్యాంకు 25వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ నిజాయతీ, నిబద్ధతతో పనిచేసే సంస్థలు కొన్ని సందర్భాల్లో ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ, వాటిని అధిగమించి ప్రగతి సాధిస్తున్నాయన్నారు. బ్యాంక్ వ్యవస్థాపక చైర్మన్ ఎం.రామకృష్ణరాజు మాట్లాడుతూ బ్యాంకు రూ.500 కోట్ల టర్నోవర్‌కు చేరుకుందన్నారు. రూ.300 కోట్లు డిపాజిట్లు, రూ.200 కోట్ల రుణాలు అందజేసినట్టు వివరించారు. 14 శాతం డివిడెంట్ అందజేస్తున్నట్టు తెలిపారు. సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ సహకార రంగంపై పూర్తి అవగాహనతో నడపడం వలన మహారాజా బ్యాంకు వృద్ధి సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ, గుత్తి, గుంటూరు కో-ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులు చిట్టూరి రవీంద్ర, జిలానీ, జి.శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వివిధ కో-ఆపరేటివ్ బ్యాంక్‌ల చైర్మన్‌లు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర మాజీమంత్రి అశోక్ గజపతిరాజును సత్కరిస్తున్న అతిథులు, చిత్రంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తదితరులు

అప్పన్నను దర్శించుకున్న పంచాయతీరాజ్ శాఖ కమిషనర్

సింహాచలం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ రేవు ముత్యాలరాజు కుటుంబ సమేతంగా వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న కమిషనర్ గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి, శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.


రేవు ముత్యాలరాజు దంపతులకు స్వామి చిత్రపటం బహూకరణ

రౌడీషీటర్లకు హెచ్చరిక

సీతంపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు ఆటంకం కల్పించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని నాలుగో పట్టణ ఎస్ఐ చిన్నం నాయుడు రౌడీషీటర్లను హెచ్చరించారు. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్, ద్వారకా పోలీసు స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లకు స్టేషన్ సీఐ రమణ, సత్యనారాయణల ఆధ్వర్యంలో ఎస్ఐలు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అందరితో వ్యక్తిగతంగా మాట్లాడుతూ ఎవరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ఎటువంటి గొడవలకు దిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం: విష్ణుకుమార్‌రాజు


క్రీడాకారులతో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

మాధవధార, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 50వవార్డులో నిర్వహించిన రోల్‌బాల్ స్కేటింగ్ వేసవి శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. మే నెల మొత్తం బాలబాలికలకు శిక్షణ ఇచ్చారు. ఆదివారం జరిగిన ముగింపు సమావేశంలో ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు హాజరై బాలలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి క్రీడాకారులకు ఎప్పుడూ ప్రోత్సాహం ఉంటుందన్నారు. కోచ్‌లు, సీనియర్లు మెరుగైన ఫలితాల కోసం బాలలకు మరింతగా తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమానికి రోల్‌బాల్ స్కేటింగ్ కోచ్ సంతోష్, రోల్‌బాల్ స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, వైశాఖీ స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, కమిటీ సభ్యులు, స్థానికులు, క్రీడాకారుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

4న జగన్ పాలనా విముక్తి దినం: ఎంపీ కలిశెట్టి

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది జూన్ 4న మాజీ ముఖ్యమంత్రి జగన్ పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించడంతో ఆ రోజును జగన్ పాలనా విముక్తి దినంగా ప్రకటిస్తున్నామని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన తీర్పు పట్ల జగన్‌కు గౌరవం లేదని విమర్శించారు. ప్రజలు తీర్పు ఇచ్చే రోజును వెన్నుపోటు దినంగా ప్రకటించడంలోనే ఆయన వ్యక్తిత్వం తెలుస్తుందని ఎద్దేవా చేశారు. కడపలో మహానాడు నిర్వహించకూడదని ఆ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇప్పించిన ఘనత జగన్‌దేనని చెప్పారు. వైసీపీ కార్యక్రమాలను టీడీపీ ఏనాడైనా అడ్డుకుందా అని ప్రశ్నించారు. కడపలో మహానాడు అద్భుతంగా జరిగిందని, రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది తరలివచ్చారని చెప్పారు. అక్కడి ప్రజలు కూడా మహానాడులో ఎంతో ఆనందంగా పాల్గొన్నారన్నారు. రాష్ట్రాభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిసారిస్తున్నారని తెలిపారు. టీడీపీ విశాఖ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని మోహన్ ఉన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

రాష్ట్రంలో తొలి యాంటీ డ్రగ్ పార్కు

(5వ పేజీ తరువాయి)
ఉన్న సిటీ సెంట్రల్ పార్కులో సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.3.5 కోట్ల వ్యయంతో యాంటీ డ్రగ్ పార్కును ఏర్పాటు చేయనున్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే ఏమి జరుగుతుంది? అవి లేకుంటే జీవితం ఎంత అందంగా ఉంటుందో ఇక్కడ అర్థమయ్యేలా చెబుతారు. అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇస్తారు. దీనిని చికిత్సా కేంద్రంలా కాకుండా రోజూ ఆహ్లాదం కోసం పార్కుకు వచ్చినట్టు వచ్చి కొత్త జీవితం ప్రారంభించేలా చూస్తారు.

పార్క్ ఆఫ్ లైఫ్‌గా చెబుతాం

ఇది పేరుకు యాంటీ డ్రగ్ పార్కు అయినా దీనిని మేము 'పార్క్ ఆఫ్ లైఫ్'గా చెబుతాం. మత్తుకు బానిసలైన వారిని అందులోనుంచి బయటకు తీసుకురావడమే కాకుండా, కొత్తగా ఎవరూ మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. యువగళం పాదయాత్ర సందర్భంగా వచ్చిన ఆలోచన ఇది. యువతను సన్మార్గంలో నడిపించాలన్నదే మా ప్రయత్నం.

-ప్రణవ్‌గోపాల్, వీఎంఆర్డీఏ చైర్మన్

తొట్లకొండపై యోగాంధ్ర

(5వ పేజీ తరువాయి)
ప్రత్యేక యోగాసనాల కార్యక్రమాన్ని ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు నిర్వహించారు. ఇందులో సుమారు వెయ్యి మంది పాల్గొని యోగాసనాలు వేశారు. ముందుగా మయన్మార్‌కు చెందిన బౌద్ధ గురువులు రాజదమ్మ, కాంబోడియాకు చెందిన బర్మరే, విశాఖ బౌద్ధ సంఘ సభ్యులు ధర్మాచారి, తదితరుల ప్రార్థనలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటారన్నారు. ప్రధాన వేదిక అయిన ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు యోగాసనాలు వేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. సుమారు ఐదు లక్షల మంది ప్రజలు ఇందులో భాగస్వాములు కానున్నారని పేర్కొన్నారు. యోగాసనాల ద్వారా ప్రపంచ రికార్డు నెలకొల్పేలా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో గల ట్రైనింగ్ సెంటర్‌లో వందమంది చొప్పున మూడు ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రజలకు యోగాసనాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. కాగా 21న జరిగే అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో పాల్గొనే వారి కోసం రవాణా సదుపాయాన్ని కల్పిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, భీమిలి ఆర్డీవో సంగీత మాధూర్, పలువురు జిల్లా అధికారులు, నావికాదళ అధికారులు, బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు, యోగా అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య శాఖలో బదిలీలు షురూ

(5వ పేజీ తరువాయి)
కొత్తవారిని రానివ్వకుండాఎంతోమంది ఉద్యోగులు పాతుకుపోయారు. ఇటువంటి వారి వల్ల అనేకచోట్ల అవినీతికి ఆస్కారం ఏర్పడుతోంది. తాజా బదిలీల్లో ఇలాంటి వారంతా కొత్త ప్రాంతాలకు వెళ్లనున్నారు. దీనివల్ల అవినీతికి చెక్ పడుతుందని పలువురు పేర్కొంటున్నారు. తాజా బదిలీలతో ఆరోగ్యశాఖలోని కీలక సెక్షన్లు, కేజీహెచ్, ఇతర ప్రభుత్వాస్పత్రుల్లోని కొన్ని విభాగాల్లో అవినీతికి అడ్డుకట్ట పడుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఇవీ మార్గదర్శకాలు..

బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను చూస్తే ఒకేచోట ఐదేళ్లు దాటి పనిచేస్తున్న ఉద్యోగులందరినీ ట్రాన్స్‌ఫర్ చేయనున్నారు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల్లో ఆఫీస్ బేరర్లుగా ఉండి ఒకే ఇనిస్టిట్యూట్‌లో మూడు నుంచి తొమ్మిదేళ్లలోపు పనిచేస్తున్న వారిని తప్పనిసరిగా మరో ఇనిస్టిట్యూట్ (లోకల్)కు మార్చాల్సి ఉంటుంది. లోకల్‌గా లేకపోతే బయటకు వెళ్లాల్సి ఉంటుంది. తొమ్మిదేళ్లు దాటితే తప్పనిసరిగా బదిలీ కావాలి. ఆఫీస్ బేరర్స్ కాని ఉద్యోగులు మూడు నుంచి ఐదేళ్లలోపు ఒకే ఇనిస్టిట్యూట్‌లో పనిచేస్తుంటే తప్పనిసరిగా లోకల్‌గా ఉన్న మరో ఇనిస్టిట్యూట్‌కు బదిలీ కావాల్సి ఉంటుంది. లోకల్‌గా వేకెన్సీ లేకపోతే తప్పనిసరిగా మరో ప్రాంతానికి వెళ్లాల్సిందే. ప్రతి ఉద్యోగి బదిలీ కావాలనుకుంటే ఐదు ప్రాంతాలను ఆప్షన్‌గా ఎంచుకోవచ్చు. ఈ మేరకు ఆయా కేటగిరీలకు సంబంధించిన ఉద్యోగుల వివరాలను ఈ నెల మూడో తేదీలోగా కార్యాలయ ఆవరణలో డిస్‌ప్లే చేయాల్సి ఉంటుంది. ఉద్యోగులు తమ దరఖాస్తులను బదిలీ అధికారికి మూడో తేదీలోగా అందించాలి. అలాగే ఏమైనా మార్పులు, చేర్పులకు సంబంధించిన వివరాలను 4, 5 తేదీల్లోగా బదిలీలకు సంబంధించిన కంట్రోలింగ్ అధికారికి అందించవచ్చు. 6 నుంచి 8వ తేదీలోగా ఉన్నతాధికారులు ఆయా దరఖాస్తులను పరిశీలిస్తారు. 9న ఉద్యోగులు ఎంపిక చేసుకున్న స్థానాలతో కూడిన జాబితాను పొందుపరిచి గ్రీవెన్స్‌లను కోరుతారు. 10, 11 తేదీల్లో ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయవచ్చు. 12 నుంచి 14వ తేదీల మధ్య అభ్యంతరాలను నివృత్తి చేసి తుది జాబితాను అధికారులు పొందుపరుస్తారు. అదేవిధంగా 15 నుంచి 17వ తేదీల మధ్య బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తారు.



గాజువాక : సమావేశంలో మాట్లాడుతున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



కూర్మన్నపాలెం : వడ్లపూడిలో రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్



ఆటోనగర్ : 71వ వార్డులో రేషన్ డిపోను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజాన రామారావు



సింధియా : రేషన్ డిపో వద్ద సరుకులు తీసుకుంటున్న కార్డుదారులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

» ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు » పలు చోట్ల రేషన్ డిపోల్లో సరుకుల పంపిణీ » సరుకుల కోసం పెద్ద సంఖ్యలో క్యూ కట్టిన కార్డుదారులు

గాజువాక, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పేదలకు పంపిణీ చేసే రేషన్ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిందని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 67వ వార్డులో రేషన్ డిపోను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్ పంపిణీ చేసే వ్యాను ఎప్పుడు వస్తుందో తెలియక చాలా మంది పనులు మానుకొని ఇంటి వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితులు ఇకపై ఉండవన్నారు. రోడ్డుపై వేచి ఉండాల్సిన పని లేదని, ఇకపై పదిహేను రోజుల పాటు ఉదయం, సాయంత్రం రెండు పూటలా రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. 65 ఏళ్ల దాటిన ఒంటరి వృద్ధులు, వికలాంగుల కోసం ఇంటి వద్దనే రేషన్ ఇచ్చే విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. పారదర్శకంగా రేషన్ పంపిణీ జరుగుతుందని, అవినీతికి ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. వ్యానులో రేషన్ పంపిణీ చేసే విధానం వలన కోట్లాది రూపాయలు దుర్వినియోగం అయ్యాయన్నారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, స్థానిక నాయకులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో..

ఆటోనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసర సరుకులను రేషన్ డిపోల ద్వారా అందించడం ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఇక్కట్లకు గురి కాకుండా చేయడమే కూటమి ప్రభుత్వ ఉద్దేశమని 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు అన్నారు. ఆదివారం 71వ వార్డు దిబ్బపాలెంలో రేషన్ డిపో ప్రారంభోత్సవంలో పాల్గొని కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పప్పు శంకరరావు, ప్రతాపరావు శ్రీనివాసరావు, ఎలుగుబంటి నర్సింగరావు,రాజారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే 70వ వార్డులోని డ్రైవర్సు కాలనీలో కూటమి నాయకులు నూతన రేషన్ డిపోను ప్రారంభించారు. ప్రతి నెలా 15 వరకూ నిర్దేశించిన సమయాల్లో డిపోలను సక్రమంగా తెరచి ప్రజలకు సేవలను అందించాలని డీలర్లకు సూచించారు. కార్యక్రమంలోచట్టి గోపి, కేవీఎస్ శంకరరావు, దేనంకొండ కృష్ణంరాజు, శ్రీకాంత్, శ్రీను, డీలర్ హరి తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ 86 వార్డు రాజీవ్ నగర్‌లో నూతన రేషన్ డిపో ప్రారంభోత్సవంలో కూటమి నాయకులు నల్లూరు సూర్యనారాయణ, కాద శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేదవాడికి రేషన్ సరుకులు ఎలాంటి ఇబ్బంది లేకుండా అందేలా కార్యక్రమంలో వేగుంట శ్రీనివాస్, గణపతి, నాగార్జున.సుబ్బయ్య, కె.రమేష్, జగదీష్, వేంకటేష్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెంలో..

కూర్మన్నపాలెం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పేదల రేషన్ కష్టాలకు నేటితో చెక్ పడిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి, కణితిలలో ఆదివారం ఉదయం రేషన్ డిపోల ద్వారా నిర్వహించిన సరుకుల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ దుకాణాల నిర్వహణ ఇబ్బందిగా తయారైందని విమర్శించారు. కార్యక్రమంలో కూటమి నేతలు రాజన్‌రాజు, సూరిశెట్టి పెంటారావు, డివి అప్పారావు, రాంబాబు, సిరసపల్లి కనకరాజు, లక్కరాజు సోంబాబు,రాము, దానయ్య, కృష్ణ, శ్రీను, ఆనంద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సింధియాలో..

సింధియా, జూన్ 01, (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 40, 62, 63, వార్డుల్లో రేషన్ డిపోల వద్ద లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరకులు పంపిణీ చేశారు. సాంకేతిక సమస్యలు తలెత్తినా గంటల తరబడి కూర్చోబెట్టకుండా ఫోటో తీసుకుని సరుకులు ఇచ్చేలా యంత్రం ఆదేవాలు ఇవ్వడం వల్ల లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీలలోపు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుండి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయని డిపో నిర్వాహకులు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులైన వారికి ప్రతినెలా 5వ తేదీలోగా సరకులు ఇళ్ల వద్దే అందిస్తామన్నారు.

62వ వార్డులో..

జీవీఎంసీ 62వ వార్డు పరిధి గుడివాడ అప్పన్న కాలనీలో ఎమ్మెల్యే పి.గణబాబు రేషన్ డిపోను పున ః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో రేషన్‌నుతీసుకునెందుకు రు చివర ప్రజలు పడిగాపులు కాసేవారని, వాహనం ద్వార వచ్చే బియ్యం కొంతమందికే దక్కేవని, తర్వాత ఆ వాహనం ఆ ప్రాంతానికి వచ్చేది కాదని, దీంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. ఇప్పుడు అలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లైయి అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే 63వ వార్డు పరిధి కాకరలోవ, చింతలలోవ గ్రామాలలో గల రేషన్ డిపోలను వార్డు కార్పొరేటర్ గల్లా పోలిపిల్లి (చిన్నా) పునఃప్రారంభించారు.

అక్కిరెడ్డిపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 68, 69 వార్డుల్లోని మింది, వెంకటేశ్వరకాలనీ, అక్కిరెడ్డిపాలెం, తుంగ్లాంతో పాటు పలు రేషన్ దుకాణాల వద్ద కార్డుదారులకు నిత్యావసర సరుకుల పంపిణీ ప్రారంభమైంది. పలు రేషన్ దుకాణాల్లో బయో మెట్రిక్ మిషన్లు కొద్దిసేపు మొరాయించినప్పటికి తరువాత చక్కగా పని చేయడంతో కార్డు దారులు ఆనందంగా సరుకులు తీసుకు వెళ్లారు. మిందిలో సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంత లక్ష్మి ప్రారంభించగా.. ఈటి శ్రీను, డొప్ప అప్పలరాజు, జి.తాతారావు తదితరులు పాల్గొన్నారు. వెంకటేశ్వరకాలనీలో 69వ వార్డు కూటమి నాయకులు కరణం ముత్యాలనాయుడు ప్రారంభించారు.

అగనంపూడిలో..

అగనంపూడి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79, 85 వార్డుల పరిధి అగనంపూడి ఉక్కు నిర్వాసిత కాలనీలు, పరిసర ప్రాంత గ్రామాల్లో ఆదివారం రేషన్ డిపోలు ప్రారంభాన్ని వేడుకగా నిర్వహించారు. నాలుగేళ్ల పాటు మూత బడిన డిపోలకు నూతన శోభ సంతరించుకుంది. డీలర్ల మామిడి తోరణాలు, పూలదండలతో డిపోలను అలంకరించారు. 79వ వార్డులో గల ప్రశాంతినగర్, గల్లావానిపాలెం ప్రాంతాల్లో రేషన్ డిపోలను వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ కూటమి నేతలతో కలిసి ప్రారంభించారు. డీలర్ల సమయ పాలన పాటించి సరుకులను అందజేయాలని సూచించారు. అలాగే 85వ వార్డు పరిధిలో గల ఫార్మాసిటీ పునరావాస కాలనీ, పినమడక, దిబ్బపాలెం, కొండయ్యవలస, దానబోయిన పాలెం ప్రాంతాల్లో డిపోలను 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి కూటమి నేతలతో కలిసి ప్రారంభించారు.



ఈత కొలనులో జల యోగాసనం వేసిన డాక్టర్ యార్లగడ్డ గీతా శ్రీకాంత్

విశాఖ మహిళ జల యోగాసనాలు

» 30 రకాల ఆసనాలు వేసిన డాక్టర్ యార్లగడ్డ గీతా శ్రీకాంత్

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంఘ సేవకురాలు, పారిశ్రామికవేత్త డాక్టర్ యార్లగడ్డ గీతా శ్రీకాంత్ జల యోగాలో భాగంగా వివిధ యోగాసనాలు వేసి అబ్బురపరిచారు. ఆదివారం విశాఖలోని స్పోర్ట్స్ ఎరీనాలో ఆర్ట్ లివింగ్, విశాఖ డిస్ట్రిక్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ ఆయుష్ డిపార్ట్‌మెంట్ సంయుక్త సహకారంతో గంటపాటు జలయోగ ప్రదర్శన చేశారు. మొత్తం 30 రకాల ఆసనాలు వేసి సందర్శకులను అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ జల యోగా వల్ల శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. హిమాలయ యోగి ప్రభాకర్ గురూజీ.. జల యోగా ఉపయోగాలు, ప్లావని ప్రాణాయామం గురించి వివరించారు. అనంతరం గీతా శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ కృషితో యోగాను ప్రపంచ దినోత్సవంగా ప్రకటించిన తరువాత జల యోగాపై దృష్టి సారించానన్నారు.

ఉపాధ్యాయుల బదిలీల్లో వీడని గందరగోళం

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో గందరగోళం కొనసాగుతోంది. కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించాలన్న ప్రభుత్వ నిర్ణయమే దీనికి కారణమన్న వాదన ఉపాధ్యాయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించడాన్ని ఎస్‌జీటీలు వ్యతిరేకిస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలకు పని భారం ఎక్కువగా ఉంటుంది. ఇప్పటివరకు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు బోధన చేసిన స్కూల్ అసిస్టెంట్లు, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంగా వెళితే మూడు నుంచి ఐదు తరగతులకు బోధన చేయడం ఏమిటన్న వాదన వారిలో ఉంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో సర్దుబాటుతో మిగిలిన స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా నియమిస్తున్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో హెచ్‌ఎంలుగా వెళ్లేందుకు పలువురు స్కూల్ అసిస్టెంట్లు సమ్మతించినా... ఏజెన్సీలో మారుమూల ప్రాంతాలకు వెళ్లడానికి విముఖత చూపుతున్నారు. ఆదివారం సాయంత్రంతో ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎంలుగా వెళ్లడానికి స్కూల్ అసిస్టెంట్లకు ఇచ్చిన గడువు ముగిసింది. మొత్తం 563 పాఠశాలల్లో ఇంకా 26 పాఠశాలలకు ఎవరూ ఆప్షన్ ఇవ్వలేదు. దీంతో మిగులుగా ఉన్న 86 మంది స్కూల్ అసిస్టెంట్లలో 26 మందిని ఏజెన్సీకి పంపనున్నారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించి వారిని ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా పంపితే మంచిదని ఎస్టీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు అభిప్రాయపడ్డారు.

ఫిలిప్పీన్స్ సదస్సుకు ఈపీడీసీఎల్ సీఎండీ

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు జరగనున్న ఆసియా క్లీన్ ఎనర్జీ ఫోరమ్ (ఏసీఈఎఫ్)- 2025 సదస్సుకు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ వెళుతున్నారు. ఈ పర్యటనకు అయ్యే మొత్తం వ్యయాన్ని ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ భరిస్తుంది. క్లీన్ ఎనర్జీపై ఏపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న నేపథ్యంలో అక్కడ చర్చకు వచ్చే అంశాలను రాష్ట్రంలో ఏ విధంగా ఉపయోగించుకోవచ్చో సూచిస్తూ పర్యటన తరువాత నివేదిక సమర్పించాలని ఆయనకు ప్రభుత్వం సూచించింది.

నేడు ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్ ఓపెన్ ఆడిటోరియం పునఃప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన రాజీవ్ ఇండోర్ స్టేడియం

పెదగంట్యాడ, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 65వ వార్డు పరిధి వికాస్ నగర్‌లో రూ.11 కోట్లతో ఆధునీకరించిన రాజీవ్ ఇండోర్ స్టేడియం, ఓపెన్ ఆడిటోరియం, నూతనంగా నిర్మించిన స్విమ్మింగ్ పూల్‌ను సోమవారం ప్రారంభించనున్నారు. 16 ఏళ్ల క్రితం జీవీఎంసీ నిర్మించిన ఇండోర్ స్టేడియం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ప్రస్తుత కార్పొరేటర్ బొద్దు నరసింహపాత్రుడు జీవీఎంసీ పాలకవర్గం, అధికారులను సంప్రదించి వీటి ఆధునీకరణకు కృషిచేశారు. ఇండోర్ స్టేడియం పక్కనే ఉన్న విశాల స్థలంలో స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటుకు అధికారులు అంగీకరించారు. ఏడాదిన్నర క్రితం ఆధునీకరణ పనులు ప్రారంభమయ్యాయి. ఆ పనులు పూర్తవ్వడంతో సోమవారం సాయంత్రం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాసరావులు ప్రారంభించనున్నారు. ఆదివారం కార్పొరేటర్ నరసింహపాత్రుడు, జీవీఎంసీ అధికారులు ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. మంగళవారం నుంచి ఇవి క్రీడాకారులకు అందుబాటులో రానున్నాయి.

టి20 క్రికెట్‌మ్యాచ్ విజేత సీవోఎస్ 11 జట్టు

విశాఖపట్నం, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : తూర్పునావికాదళం చీఫ్ ఆఫ్ స్టాఫ్ (సీఓఎస్11), ఇండియన్ రైల్వే వాల్తేరు డివిజన్ (డీఆర్‌ఎం11) జట్ల మధ్య శనివారం రాత్రి రైల్వే క్రికెట్ గ్రౌండ్‌లో టీ 20 మ్యాచ్ జరిగింది. రెండు జట్లు హోరాహోరీగా ఆడాయి. చివరకు తూర్పునావికాదళం చీఫ్‌ఆఫ్ స్టాఫ్ జట్టు విజేతగా నిలిచింది. తూర్పునావికాదళం వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ విజేతజట్టుకు, రన్నర్ జట్టుకు ట్రోఫీలు అందజేశారు.

సినిమా గైడ్

- **భైరవం** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కరాటే కిడ్** : శారద
- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం)
- **ఫైనల్ డెస్టినేషన్** : రమాదేవి,
- **సింగిల్** : మెలోడి, కామేశ్వరి, గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 15, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 22, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 15, క్యారెట్ 38 దొండకాయలు 20, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది)54, బరబాటి 36, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోస కాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 34, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	95
లైవ్ ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210



పాపయ్యరాజుపాలెం వద్ద బియ్యం అందజేస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



గోపాలపట్నంలోని ఓ డిపోలో సరకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు, చిత్రంలో కూటమి నాయకులు

సందడిగా రేషన్ దుకాణాలు పునఃప్రారంభం

పెందుర్తి రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రేటర్ 95వ వార్డు పరిధి, గ్రామీణ ప్రాంతాల్లోని రేషన్ డిపోలను ఆదివారం పునఃప్రారంభించారు. పాపయ్యరాజుపాలెం డిపోను స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ప్రారంభించి కార్డుదారులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు దాట్ల మధు, నాయకులు రేమాల శ్రీను, సన్ని పాల్గొన్నారు. సుజాతనగర్, పురుషోత్తపురం, చీమలాపల్లి, లక్ష్మీపురం, గవరపాలెం కాలనీ, పొర్లుపాలెం, చింతల అగ్రహారం, పెదగాడి, పినగాడి గ్రామాల్లో ఉదయం 8 గంటలకే డిపోలను ప్రారంభించారు.

ప్రజలకు మెరుగైన సేవలు: గణబాబు

మల్కాపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం శివారు అల్లూరి సీతారామరాజు కాలనీకి చెందిన రేషన్ డిపోను పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆదివారం ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. తొందరలోనే మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేసే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 61, 62 వార్డుల టీడీపీ అధ్యక్షులు మజ్జి సోమేష్, మజ్జి మాలినాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు. యారాడలో రేషన్ డిపోను 64వ వార్డు టీడీపీ ఉపాధ్యక్షుడు తొత్తరి శ్రీనివాసరావు (చిట్టి) ప్రారంభించారు. ప్రజలకు ప్రభుత్వం చేరువగా ఉంటుందని తెలిపారు. ప్రజలకు మేలు చేయడమే ధ్యేయమని తెలిపారు.

పండుగ వాతావరణం

గోపాలపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): చౌక ధరల దుకాణాల ద్వారా కార్డుదారులకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో ఆదివారం జరిగింది. గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని డిపోల్లో ఈ కార్యక్రమాన్ని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ప్రారంభించారు. రేషన్ బియ్యం అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేసేందుకు చౌకధరల దుకాణాల ద్వారా సరుకుల పంపిణీని ప్రభుత్వం పునఃప్రారంభించినట్లు తెలిపారు. తొలిరోజు డీలర్లు దుకాణాలను పూలతో అలంకరించారు. గోపాలపట్నం తహసీల్దార్ సీహెచ్‌వీ రమేశ్ పాల్గొన్నారు. సర్వర్ మొరాయింపుతో కాస్త ఇబ్బంది: రేషన్ డిపోల పునఃప్రారంభం తొలిరోజున సర్వర్ మొరాయించడంతో పంపిణీలో కాస్త ఆలస్యం జరిగింది. పలు రేషన్ డిపోల వద్ద టెంట్‌లు ఏర్పాటు చేయడంతో ఎండ నుంచి ఇబ్బంది తప్పింది.

అనుకూల సమయంలో సరుకులు

వేపగుంట: రాష్ట్రంలోని ప్రజలంతా తమ అనుకూల సమయంలో రేషన్ సరుకులు పొందేందుకే గతంలో ఉన్న రేషన్ డిపోలను ప్రారంభించినట్లు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పేర్కొన్నారు. శ్రీనివాస నగర్‌లో ప్రజలకు సరుకులు పంపిణీ చేశారు. ప్రజాశ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని తిరిగి రేషన్ డిపోలను ప్రారంభించామన్నారు. కార్పొరేటర్ రాపర్తికన్నా, వరహాలు, ఆదిబాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్ జీవీఎంసీ 90వ వార్డు పరిధిలో రేషన్ దుకాణాలను కార్పొరేటర్ బొమ్మిడి రమణ ప్రారంభించారు. మొదటగా లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో ఉన్న రేషన్ డిపోను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గవరవీధిలో ఉన్న రేషన్ దుకాణం ప్రారంభించి సరుకులు పంపిణీ చేశారుటీడీపీ వార్డు అధ్యక్షడు అరుణ్‌కుమార్, సంతోష్‌పట్నాయక్,తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్: మేయర్ 'పీలా'



పెందుర్తిలో వృద్ధురాలికి రేషన్ అందజేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

పెందుర్తి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు. దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందజేయనున్నట్లు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు వెల్లడించారు. 96వ వార్డు పరిధి పెందుర్తిలోని రేషన్ డిపోను ఆదివారం ప్రారంభించిన మేయర్ పీలా నిత్యావసర సరుకులను కార్డుదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంతోషమ్మ అనే వృద్ధురాలి ఇంటికి మేయర్ వెళ్లి ఆమెకు స్వయంగా రేషన్ సరుకులను అందజేశారు, రేషన్ డిపోలో తూనికలు, బియ్యం నాణ్యతను పరిశీలించారు. ఈ పోస్ వేలిముద్ర కోసం సర్వర్ మొరాయించడంతో ఈ విషయాన్ని మేయర్ పీలా జేసీ అశోక్‌కుమార్‌కి ఫోన్ చేసి సమాచారాన్ని తెలియపరచి సమస్యను పరిష్కరించారు. అనంతరం పీలా మాట్లాడుతూ గత ప్రభుత్వం రేషన్ పేరిట బియ్యం అక్రమ రవాణా చేసి దోపిడీకి పాల్పడిందన్నారు. కూటమి సర్కార్ పారదర్శకంగా రేషన్ పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పెంటకోట రాజేంద్రప్రసాద్, పీలా జితేంద్ర, అప్పారావు, రమేశ్, సత్యం పాల్గొన్నారు.

రేషన్ సరుకులు అందజేసిన కూటమి నేతలు

నూతన రేషన్ విధానం పెందుర్తి మండలంలో కూటమి నేతలు అట్టహాసంగా ప్రారంభించారు. చౌక దుకాణాలను తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాంపురంలో మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, గొరపల్లిలో మండల టీడీపీ అధ్యక్షుడు కరక దేవుడు, చింతగట్లలో టీడీపీ నేత గనిశెట్టి కనకరాజు, నరవలో జనసేన నేత గల్లా శ్రీనివాసరావు, పులగాలిపాలెంలో టీడీపీ సీనియర్ నేత అవగడ్డ అప్పలనాయుడు చౌక దుకాణాలను ప్రారంభించారు. సర్వర్ మొరాయించడంతో నెమ్మదించిన సాంకేతిక సమస్యను అధికారులు సరిదిద్దడంతో నిత్యావసర సరుకుల పంపిణీ సాఫీగా జరిగింది.

ఆర్పీపేట: పేదలందరికీ రేషన్ సరుకులు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. రేషన్ దుకాణాన్ని 56వ వార్డులో ఆయన ప్రారంభించి కార్డుదారులకు సరుకులు అందజేశారు. గత ప్రభుత్వం ఎండీయూ వాహనాల పేరిట ప్రజాధనాన్ని దుబారా చేసిందన్నారు. నెలలో 15 రోజులు దుకాణాల వద్ద సరుకులు తీసుకోవచ్చన్నారు. కార్పొరేటర్ రాజశేఖర్, జనసేన నాయకురాలు అంగ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

వైసీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ పిలుపు



ప్రసంగిస్తున్న మళ్ల విజయప్రసాద్

మల్కాపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో విఫలమైన కూటమి ప్రభుత్వ తీరును వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ పిలుపునిచ్చారు. శ్రీహరిపురం వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సాయంత్రం 40, 58 నుంచి 63 వార్డుల వైసీపీ కార్పొరేటర్లు, అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. అరెస్టులతో కొనసాగుతున్న కూటమి పాలనను ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. మహానాడులో చెప్పేది ఏమీలేక మాజీ సీఎం జగన్మోహనరెడ్డిని తిడుతూ, వారిలో వారు పొగుడుకున్నారని అన్నారు. మంత్రి లోకేశ్ పదోతరగతి పరీక్షల మూల్యాంకనం చేయించడంలో విఫలమయ్యారని, తొలిసారిగా పెద్దఎత్తున విద్యార్థులు వాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకోవలసి రావడం దారుణమని వ్యాఖ్యానించారు కార్పొరేటర్లు పీవీ సురేష్, గుండపు నాగేశ్వరరావు, బల్ల లక్ష్మణరావు, మాజీ కార్పొరేటర్ గల్లా శ్రీను పాల్గొన్నారు.

కరాటే పోటీలు ప్రారంభం



పోటీలో తలపడుతున్న ప్రత్యర్థులు

మల్కాపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 59వ వార్డు మాజీ సైనికుల కాలనీలో గల అంబేద్కర్ మైదానంలో వాడోకో కరాటే అసోసియేషన్ ఆదివారం కరాటే పోటీలు ప్రారంభించింది. పోటీలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కరాటే శిక్షణ పొందడం వల్ల సంపూర్ణమైన ఆరోగ్యవంతులుగా ఉండవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే నిర్వాహకుడు జి.శ్రీనివాసరావు (భరత్), కూటమి నాయకులు పుర్రె సురేష్‌యాదవ్, ముజ్జడ చంద్రమౌళి, పొలిమేర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

